

గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో నీటి ప్రవాహం

పుష్కలం..!

● సాగర్ కుడి కాల్వకు 7,500 క్యూసెక్కులు ● కాల్వలకు సాగు నీటి కళ ● వ్యవసాయ పనుల్లో తీరిక లేని రైతులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి):

కృష్ణమ్మ సాగర్ కుడి కాల్వలో పరవళ్లు తొక్కుతోంది. జలవనరుల శాఖ పుష్కలంగా సాగు నీటిని విడుదల చేస్తోంది. బ్రాంచ్ కాల్వల నుంచి మైనర్ కాల్వల వరకు జలకళను సంతరించుకున్నాయి. దాదాపు అన్ని కాల్వలకు నీటి సరఫరా చేస్తుండటంతో పంటల సాగు ఊపందుకుంది. ఇప్పటికే వరి నారుమళ్లు పోసిన రైతులు.. రానున్న పది రోజుల్లో వరినాట్లు పూర్తిస్థాయిలో ప్రారంభించనున్నారు. నకరికల్లు, రాజుపాలెం మండలాల్లోని పలు ప్రాంతాల్లో వరి నాట్లు ప్రారంభమయ్యాయి. అలాగే.. వర్షాభావం నెలకొన్న 15 మండలాల్లో సాగర్ నీటితో పంటల సాగు చేపట్టారు. కంది, మొక్కజొన్న, మిరప పంటలను సాగు చేస్తున్నారు. పంటల సాగులో అన్నదాతలు తీరికలేకుండా ఉన్నారు. ట్రాక్టర్ల నిర్వాహకులకు చేతి నిండా పని లభిస్తోంది. వ్యవసాయ కార్మికులకు పుష్కలంగా పనులు దొరుకుతున్నాయి. సాగర్ డ్యాం నుంచి జవహర్ కుడి కాల్వకు 7,500 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. బుగ్గ వాగు రిజర్వాయర్ నుంచి కుడి కాల్వకు 7,500 కూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. బ్రాంచ్ కెనాల్స్, మేజర్ కాల్వలపై ఉన్న విద్యుత్ ప్లాంట్‌లలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది.



చిలకలూరిపేట మేజర్‌లో కృష్ణమ్మ పరవళ్లు

● సుంకం దెబ్బకు ఆక్వా రైతు విలవిల
● రొయ్యల ఎగుమతులపై అమెరికా పోటు!
● ధరల పతనానికి తోడు పన్ను బాదుడు
● సాగు కష్టమేనంటున్న రైతులు



బాపట్ల రూరల్ పరిధిలో ఆక్వా సాగు



ఇదేంది రొయ్యా.. ట్రంపు!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న సుంకాల నిర్ణయంతో ఆక్వా మళ్లీ సంక్షోభం వైపుగా వెళ్లే సూచనలు కనబడుతున్నాయి. 25 శాతం సుంకం నిర్ణయం ఆక్వా రంగాన్ని కూడా గట్టిగానే తాకనున్నట్లు తెలుస్తోంది. ఓ పక్క రొయ్యలకు అంతుచిక్కని వ్యాధులు, మరో పక్క ధరల పతనంతో అల్లాడుతున్న రొయ్య రైతులకు ట్రంప్ సుంకం కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో ఆక్వా రంగం దాదాపు అంపశయ్యపైకి చేరింది. విద్యుత్ రాయితీలు మొదలుకుని మేత ధరల తగ్గింపు వరకు అన్ని విషయాల్లో ఆక్వా రైతాంగాన్ని గత ప్రభుత్వం నిలువునా దగా చేసింది. ఆక్వా ఎగుమతులపై అనధికారిక జే ట్యాక్స్ వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేసింది. ఆక్వా రంగాన్ని తిరిగి గాడిన పెట్టడానికి ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ రాయితీలపై ఇటీవలే ఊరట కలిగించే ప్రకటన చేసింది. 25 కిలోల మేత బస్తాపై వంద రూపాయల వరకు తగ్గించింది. ఆక్వా ఎగుమతులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించే దిశగా అడుగులేస్తున్న దశలోనే.. ట్రంప్ టారిఫ్ నిర్ణయం.. కలవరపాటుకు గురిచేస్తోంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి):

బాపట్ల జిల్లా నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్న రొయ్యల విలువ ఏడాదికి దాదాపు రూ.888 కోట్లుగా ఉంది. ఇందులో సింహభాగం అమెరికాదే కావడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా దాదాపు 22,500 ఎకరాల్లో రొయ్యలు సాగవుతుండగా, ఇందులో వనామి వాటా 70 శాతం, టైగర్ రొయ్యల సాగు 30 శాతంగాను ఉంది. జిల్లాలో ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు ఐదు ఉండగా దాదాపు పదివేల మంది ఈ రంగంపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో అగ్రికల్చర్ తర్వాత ఆక్వా సాగుదే అగ్రభాగం. ట్రంప్ తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఎగుమతుల ద్వారా జనరేట్ అయ్యే ఆదాయంలో 25 శాతం పన్నుల రూపంలో పోవడమంటే దాదాపు రూ.200 కోట్ల (మిగతా 6లో)

ఆ ప్రభావమే ఇప్పటికీ ఉంది

సాగుపై భరోసా నిచ్చే విధం గా అనేక ప్రకటనలు ప్రభుత్వాల వైపు నుంచి వస్తున్నా రైతాంగాన్ని మాత్రం ట్రంప్ భయం వెంటాడుతూనే ఉంది. ఎగుమతులపై అమెరికా విధిస్తున్న సుంకాలకు విరుగుడుగా అక్కడి నుంచి మనం దిగుమతి చేసుకుంటున్న రొయ్యల మేతపై సుంకాన్ని పెంచాలనే వినతులను రొయ్య రైతు సంఘాలు గతంలోనే ప్రభుత్వాలకు అందించాయి. దీని ప్రభావం కూడా అంతిమంగా ఇక్కడి రైతులపైనే పడుతుందనే అభిప్రాయమే అన్ని వైపుల నుంచి వ్యక్తమవడంతో ప్రస్తుతం కేంద్రం విధిస్తున్న 5 శాతం సుంకం నిర్ణయమే కొనసాగుతోంది.

రాష్ట్ర వ్యాప్తంగా జాషువా

జయంత్యుత్సవాలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పేదరికం సహనాన్ని, కుల వివక్షను ఎదురించి పోరాడే తత్వాన్ని తనకు నేర్పాయని గుర్రం జాషువా అన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. సోమవారం పల్నాడు జిల్లా పర్యటనలో భాగంగా నరసరావుపేట పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల నుంచి జమీందారు పంక్షన్ హాలు వరకు బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న మాధవ్ స్థానిక గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహోన్నత శిఖరం గుర్రం జాషువాకు నివాళులర్పించి నరసరావుపేట జిల్లా పర్యటన ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సెప్టెంబరు 28న బీజేపీ రాష్ట్ర



జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు

వ్యాప్తంగా గుర్రం జాషువా జయంతి ఉత్సవాలు నిర్వహిస్తుందని చెప్పారు. నిరుపేద కుటుంబంలో పుట్టి వివక్షకు గురై కూడా గుర్రం జాషువా.. తిరుపతి వేంకట కవుల ద్వారా గండపెండేరాన్ని ధరించడం, అశ్వవాహనంలో ఊరేగడం, ఆయనతో పాటు అప్పటి ముఖ్యమంత్రి బెజవాడ గోపాల కృష్ణారెడ్డి కూడా రావడం ఒక మహత్తరమని మాధవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేలూరి శశికుమార్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.దయాకర్‌రెడ్డి, ఎ.సుధాకర్‌బాబు, పాతూరి నాగభూషణం, హనుమంతరావు, కె.సుబ్బారావు, చిరుమామిళ్ల అదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

త్రికరణ శుద్ధిగా.. హర్ ఘర్ తిరంగా

● మూడు దశల్లో కార్యక్రమాల నిర్వహణ
● ప్రతీ ఇంటిపై జాతీయ జెండా రెపరెపలు..
● ర్యాలీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మానవ హారాలు
● జిల్లా స్థాయిలో ఒక భారీ కార్యక్రమానికి ఆదేశాలు

8

చిన్ని గుండెకు పెద్దకష్టం

● ఆపరేషన్ ఖర్చులకు దాతల కోసం ఎదురు చూపు ● స్పందించిన రావిపాటి దేవేంద్రరావు 50వేల ఆర్థిక సహాయం అందజేత

10న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

6

(బాపట్ల, ఆంధ్రజ్యోతి):

క్వారీల్లో పనిచేసే కార్మికుల వివరాలు లేకపోవడంతో లేబర్ అధికారి శివప్రసాద్‌పై కలెక్టర్ వెంకటమురళి సోమవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. బల్లికురవ మండలంలోని గ్రానైట్ క్వారీలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఒడిశాకు చెందిన ఆరుగురు కార్మికులు మరణించారు. ఎనిమిది మంది గాయపడిన సంగతి తెలిసిందే. వీరి వివరాల నమోదు విషయంలో కార్మికశాఖ అలసత్వం కలెక్టర్ దృష్టికి

అంత లెక్క లేదా?

● లేబర్ ఆఫీసర్‌పై కలెక్టర్ ఆగ్రహం

రావడంతో ఆయన సీరియస్‌గా పరిగణించినట్లు సమాచారం. మృతులకు సంబంధించిన ఆధార్ కార్డులు మినహా మరే వివరాలు లభ్యం కాకపోవడంతో ఒడిశాలోని వారి బంధువులకు సమాచారం అందించడం యంత్రాంగానికి ఓ దశలో క్లిష్టంగా మారింది. క్వారీల్లో పనిచేసే కార్మికులకు పీఎఫ్ సౌకర్యంతో పాటు జీతభత్యాల పర్యవేక్షణ కూడా కార్మిక శాఖ విభాగానిది. అయితే వారి ప్రాథమిక సమాచారం కూడా సదరు అధికారి వద్ద లేకపోవడం కలెక్టర్ వెంకటమురళి కోపానికి కారణంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారం రోజుల్లో క్వారీల్లో పనిచేసే వారి వివరాలతో పాటు అసంఘటిత రంగాల్లో పనిచేసే వారి జాబితా కూడా సమగ్రంగా తయారు చేసి నివేదిక అందించాలని కార్మిక శాఖను కలెక్టర్ వెంకటమురళి ఆదేశించినట్లు సమాచారం.

తవ్వడానికొచ్చి.. తనువు చాలిస్తున్నారు..

గ్రానైట్, మెటల్ క్వారీల్లో భద్రతా చర్యలు శూన్యం

ఇష్టారాజ్యంగా తవ్వకాలు.

బ్లాస్టింగ్ సమయంలో.. నిబంధనలు గాలికి

చుట్టపు చూపుగా అధికారుల పర్యవేక్షణ



బల్లికురవ సమీపంలోని గ్రానైట్ క్వారీ

అద్దంకి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): క్వారీలు.. ప్రమాదాల ఖిల్లాలుగా మారాయి. భద్రతా చర్యలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు.. చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు. సంబంధిత అన్ని శాఖల అధికారులు నెలవారీ మామూళ్ల మత్తులో..క్వారీల వైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. బాపట్ల జిల్లా పరిధిలో బల్లికురవ, కొణిదెన, మల్లాయపాలెం, సంతమాగులూరు మండలంలోని గురిజేపల్లి, పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలంలోని యడవల్లి, మురికిపూడి, బొప్పూడి, వినుకొండ మండలంలోని ఉమ్మడివరం, నూజెండ్ల మండలం రవ్వవరం తదితర ప్రాంతాల్లో సుమారు 100కు పైగా గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. పలు చోట్ల పెద్దఎత్తున మెటల్ క్వారీలు ఉన్నాయి. వీటికి అయితే అనుమతులు ఉండేది అతి తక్కువే. ఇక బ్లాస్టింగ్ అనుమతులు అసలు ఉండవు. ఏ ఒక్క క్వారీలో కూడా నిబంధనలు పాటించరనేది జగమెరిగిన సత్యం. కానీ, అధికారులు మాత్రం.. అప్పుడప్పుడు వచ్చి అంతా సవ్యంగా ఉందని కితాబు లు ఇవ్వడం ఆశ్చర్యానికి గురిచేసే అంశం. సెలవు దినాల్లో కూడా కూలీల చేత పనులు చేయించడం క్వారీల్లో పరిపాటిగా మారింది. ఇక సమయపాలన కూడా ఉండదు. పలు సందర్భాలలో సరైన వెలుతురు లేకపోయినా పనులు చేయిస్తుంటారు. ఇక వర్షాలు పడ్డ సమయంలో.. కొండ ప్రాంతం నుంచి జాలువారే జలాలతో.. బండరాళ్లు జారి పడే అవకాశం ఉంటుందనేది ప్రతి ఒక్కరికి తెలిసిన విషయమే. అటువంటి సందర్భాల్లో కూడా పనులు చేయించడం మరింత విమర్శలకు తావిస్తోంది. ఏటా నిర్వహించే భద్రతా వారోత్సవాలు అంతా అధికారుల హంగామా అని ప్రమాదాలు జరిగినప్పుడు తేటతెల్లం అవుతోంది.

కానరాని సెఫ్టీ ఫస్ట్, సెకండ్ మేనేజర్‌లు

ప్రతి క్వారీలో పని జరిగే సమయంలో ఖచ్చితంగా ఫస్ట్, సెకండ్ మేనేజర్ ల పర్యవేక్షణలో కూలీలు, కార్మికులు పని చేయాల్సి ఉంటుంది. అయితే ఏ ఒక్క క్వారీలో కూడా పర్యవేక్షణ మేనేజర్‌లు కానరారు. వారి సర్టిఫికేట్‌లు మాత్రమే ఉంటాయి. సర్టిఫికేట్‌లు ఇచ్చినందుకు నెల వారీ జీతం చెల్లిస్తుంటారు. దీంతో ప్రమాదాలు జరిగేందుకు ఎక్కువ అవకాశాలు ఉంటున్నాయి.

ఇతర రాష్ట్రాల కార్మికులే అధికం

క్వారీలలో పనిచేసే కార్మికులు, కూలీలు ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారే అధికంగా ఉన్నారు. స్థానికులను పనిలో ఉంచుకుంటే ప్రమాదాలు జరిగినప్పుడు ఇబ్బందులు వస్తాయనే ఉద్దేశంతో.. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారితోనే పనులు చేయిస్తున్నారు. ఎక్కువ భాగం కూలీలు ఒడిశా నుంచి వస్తున్నారు. ప్రమాదాలు జరిగి.. ఒకరిద్దరు చనిపోయిన సందర్భాల్లో గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాలను సొంత ఊర్లకు పంపిన సందర్భాలూ ఉన్నాయి. గత రెండు దశాబ్దాల కాలంలో బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో ఉన్న క్వారీలలో ప్రమాదాలు జరిగి.. సుమారు 20 మంది వరకు మృతి చెంది ఉంటారని అంచనా. అయితే ఆదివారం జరిగిన ఘోర ప్రమాదం గతంలో ఎప్పుడూ జరగలేదు. దీంతో ఒక్కసారిగా అందరూ ఉలిక్కిపాటుకు గురయ్యారు.

ఇప్పటికైనా అధికారుల తీరు మారేనా...

ఘోర ప్రమాదం జరిగిన నేపథ్యంలో ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు మేల్కొని క్వారీలలో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటారో.. లేదో వేచి చూడాల్సి ఉంది.

ఏసీబీ వలకు చిక్కినడ్రెయినేజీ శాఖ

జూనియర్ అసిస్టెంట్

కాంట్రాక్టర్‌కు ఎం.బుక్ ఇచ్చేందుకు రూ.30 వేలు డిమాండ్


రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ డీఎస్పీ



పట్టుబడిన శ్రీనివాసరావు

గుడివాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గుడివాడలోని డ్రెయినేజీ శాఖ ఈఈ కార్యాలయంపై ఏసీబీ అధికారులు సోమవారం దాడి చేశారు. కాంట్రాక్టర్ నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటున్న జూనియర్ అసిస్టెంట్ గరికిపాటి శ్రీనివాసరావును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన కాంట్రాక్టర్ తురకా రాజా వర్క్ డిపాజిట్ ఎం.బుక్ ఇవ్వాలని డ్రెయినేజీ శాఖ అధికారులను కోరారు. దీనికి గుడివాడలోని డ్రెయినేజీ ఈఈ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ అసిస్టెంట్ గరికిపాటి శ్రీనివాసరావు రూ.30 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టర్ రాజా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ క్రమంలో సోమవారం రూ.30 వేలు నగదు జూనియర్ అసిస్టెంట్‌కు రాజా ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ బి.వి.సుబ్బారావు నేతృత్వంలో దాడి చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ అదుపులోకి తీసుకున్న శ్రీనివాసరావును ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు వి.వి.సత్యనారాయణ, ఎం.వి.ఎస్.నాగరాజు, ఎస్ఐ పూర్ణిమ పాల్గొన్నారు.

రాజధాని అమరావతి కోసం భూములిచ్చిన రైతుల రుణ కష్టాలు తీరాయి. ప్రభుత్వం ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లపై రుణాలిచ్చేందుకు ఎట్టకేలకు బ్యాంకులు ముందుకు వచ్చాయి. దీంతో రైతులను ఏళ్ల తరబడి వెంటాడుతున్న దా'రుణ'కష్టాల నుంచి బయటపడి ఊపిరి పీల్చుకునే అవకాశం దొరికినట్లయింది.



రాజధాని రైతులకు రిటర్న్ గిఫ్ట్!



● రిటర్నబుల్ ప్లాట్లపై బ్యాంకు రుణాలకు మోక్షం ● అన్ని బ్రాంచ్‌ల అధికారులకు లీడ్ బ్యాంకు ఆదేశం
● ఫలించిన రైతుల సుదీర్ఘ పోరాటం!
● అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు భారీ ఊరట!

గుంటూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాజధాని కోసం వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులకు అప్పటి టీడీపీ ప్రభుత్వం రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చింది. అయితే ఆ ప్లాట్లపై రుణాలిచ్చేందుకు బ్యాంకులు ముందుకు రాలేదు. నియమాలు, సాంకేతిక కారణాలు చూపుతూ ముఖం చాటేశారు. గత అయిదేళ్ల పాలనలో కౌలు రాకపోవడంతో పాటు.. ప్రభుత్వ వేధింపులు తాళలేక చిన్న, సన్నకారు రైతులు అనేకమంది అప్పులపాలయ్యారు. రాజధాని కోసం భూములిచ్చిన వారిలో ఎకరాలోపు ఉన్న చిన్న కారు రైతులు 20,490 మంది, ఒకటి నుంచి రెండెకరాల లోపు ఉన్న సన్నకారు రైతులు 5 వేల మంది ఉన్నారు. పోయిన ఆరేళ్లలో (మిగతా 6లో)

మైన్స్‌సేఫ్టీ అధికారుల పరిశీలన

బల్లికురవ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీర్లకొండ వద్ద ఉన్న సత్యకృష్ణ గ్రానైట్ క్వారీని సోమవారం రాష్ట్ర మైన్స్ సేఫ్టీ డెరెక్టర్ ఆశోక్‌కుమార్, డిప్యూటీ డెరెక్టర్ జ్ఞానేశ్వర్‌ల బృందం పరిశీలించింది. క్వారీలో ప్రమాదవశాత్తు బండరాయి అచ్చు ఊడి పడి ఆదివారం ఆరుగురు ఒడిశాకు చెందిన కూలీలు మృతి చెందారు. ప్రమాదం జరిగిన తీరును అక్కడి కార్మికులను అడిగి తెలుసుకున్నారు. క్వారీలో భద్రత చర్యలు ఎలా ఉన్నాయి. పనులు చేసే సమయంలో ఎంత మంది కూలీలు అక్కడ ఉన్నారని ప్రశ్నించారు. వారు అందరు సేఫ్టీకి సంబంధించి జాగ్రత్తలు పాటించారా..? లేదా..? అన్న దానిపై విచారించారు. క్వారీలోని మేనేజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రతపరంగా ముందుస్తు జాగ్రతలు తీసుకొని ఉంటే ఇలాంటి ఘటనలు జరిగి ఉండేవి కాదన్నారు. ఘటన స్థలంలో ర్యాంపులు, ఎత్తులు, బెంచ్‌లు, హద్దులను పరిశీలించారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ప్రమాద క్వారీని పరిశీలన చేసి నివేదికను తయారు చేస్తున్నామని వారు తెలిపారు. అనంతరం నరసరావుపేట వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో మైన్స్ ఏడీ రామచంద్రరావు, లేబర్ కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగిన గ్రానైట్ క్వారీని పరిశీలిస్తున్న మైన్స్ సేఫ్టీ డెరెక్టర్ అశోక్‌కుమార్, డీడీంఎస్ జ్ఞానేశ్వర్ తదితరులు





క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాధవ్

క్వారీ క్షతగాత్రులకు మాధవ్ పరామర్శ

నరసరావుపేట లీగల్, ఆగస్టు 4, (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా బల్లికురవ మండలంలో ఆదివారం చోటుచేసుకున్న క్వారీ ప్రమాదంలో గాయపడి పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఎనిమిది మంది క్షతగాత్రులను సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. క్షతగాత్రులకు ఆర్థిక సాయం అందజేస్తుందని చెప్పారు. క్వారీల యాజమాన్యాలు అలెర్ట్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్వారీ ప్రమాదంపై గనుల శాఖాధికారులు స్పందించారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. క్షతగాత్రుల వివరాలు, ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వీఆర్వోకి వైసీపీ నాయకుడి బెదిరింపులు

బొల్లాపల్లి, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేమిడిచర్ల గ్రామ ఇన్‌చార్జి వీఆర్వో గంధం అరుణ్‌రెడ్డిపై బొల్లాపల్లి మండల వైసీపీ కన్వీనర్ కాకర్ల నారాయణ రెడ్డి బెదిరింపులకు దిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. ఒక సర్టిఫికెట్ విషయంలో వీఆర్వో అరుణ్‌రెడ్డికి ఫోన్ చేసిన కాకర్ల నారాయణరెడ్డి బూతులు తిడుతూ తనకు వెంటనే సర్టిఫికెట్ తెచ్చివ్వాలని, లేకుంటే సచివాయాలనికి గుమ్మడికాయ మాదిరిగా ఉరివేసి వేలాడదీస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. తాను వినుకొండ నుంచి నర్సరావుపేటకు వెళ్తున్నానని వీఆర్వో చెబుతున్నా.. వినకుండా వెంటనే వెనుక్కి వచ్చి సర్టిఫికెట్ ఇవ్వాలని లేకుంటే అంతు చూస్తానని బెదిరించాడు. వీరికి సంభాషణకు సంబంధించిన ఆడియో రికార్డు రెండ్రోజుల నుంచి సామాజిక మాధ్యమాల్లో రావడంతో వైసీపీ నేతపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. వీఆర్వో అరుణ్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో దీనిపై తహసీల్దార్ సుధాకర్‌ను వివరణ కోరగా.. వీఆర్వో అరుణ్‌రెడ్డి వైసీపీ నేత బెదిరింపులపై బొల్లాపల్లి పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడని తెలిపారు.

బాలుడు మృతదేహం లభ్యం

విజయపురిసౌత్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలంలోని పర్యాటక ప్రాంతమైన ఎత్తిపోతల జలపాతంలో గత ఆదివారం ఈతకు వెళ్లి గల్లంతైన బాలుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. తెలంగాణలోని మిర్యాలగూడకు చెందిన షేక్ సమీర్ (17) స్నేహితుడు నజీర్‌తో కలిసి నాగార్జున సాగర్ డ్యాం తిలకించేందుకు వచ్చాడు. అనంతరం ఎత్తిపోతల చేరుకొని అక్కడ రంగనాథస్వామి ఆలయ సమీపంలోని ఎత్తిపోతల జలపాతంలో ఈతకు దిగారు. సమీర్ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. నజీర్ ఈత కొడుతూ సురక్షితంగా బయటపడ్డాడు. మృతుడు సమీర్ తండ్రి గౌస్‌మియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిసౌత్ ఎస్‌ఐ అశోక్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అదృశ్యమైన వివాహిత దారుణ హత్య



శనివారం మధ్యాహ్నం భర్తతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మృతురాలు మేరి

నర్సరావుపేట లీగల్/నకరికల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 2న అదృశ్యమైన ఓ వివాహిత ఆమె భర్త చేతిలో దారుణంగా హత్యకు గురైంది. నరసరావుపేటకు చెందిన ఓ మహిళను ఆమె భర్త నకరికల్లు శివారులోని దుప్పులు కొండ వద్ద హత్య చేసిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. నరసరా వుపేట వన్ టౌన్ సీఐ చరణ్ తెలిపిన వివరాల మేరకు.. తేరటి మేరీ తల్లి కోటేశ్వరమ్మ శనివారం రోజు తన కూతురు కనిపించడం లేదని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ చరణ్ తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టి.. నకరికల్లు శివారులోని రైల్వే ట్రాక్ పక్కన మేరీ మృతదేహాన్ని కనుగొన్నారు. నరసరావుపేటకు చెందిన తేరటి మేరీ కి (29) సత్తెనపల్లి మండలం గార్లపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ రమేష్‌తో ఆరేళ్ల క్రితం మేరీకి పెళ్లి జరిగింది. కాగా వీరికి ఇద్దరు కొడుకులున్నారు. పెళ్లైన ఐదు నెలల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతూ ఉండగా శనివారం మధ్యాహ్నం మేరీని ద్విచక్ర వాహనంపై రమేష్ తీసుకొని వెళ్లినట్లు సీసీ టీవీ ఫుటేజ్ లో పోలీసులు గుర్తించారు. నరసరావుపేట డీఎస్పీ ఎం.వెంకట రమణ నరసరావుపేట వన్ టౌన్ సీఐ చరణ్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భూములు త్యాగం చేసిన రైతులకు పాదాభివందనాలు

మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్



కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను అందజేస్తున్న మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే.. ప్రజలు సుఖ శాంతులతో ఉన్నారని, గత వైసీపీ ప్రభుత్వంలో శాంతి భద్రతలు కరువై.. రాష్ట్రం అతలాకుతలం అయ్యిందని రాష్ట్ర బారీ, చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం తుళ్ళూరు మండలం తాళ్లాయపాలెం గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి అమలు అవుతున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి విరించారు. కూటమి ప్రభుత్వ పాలనపై సంతృప్తి గ్రామస్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని అమరావతి ప్రాంతంలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయంపై ఆధారపడే రైతులు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నమ్మి తమ కన్న తల్లి లాంటి భూమిని రాష్ట్రం కోసం ఇవ్వడం ఓ చరిత్రగా అభి వర్ణించారు. 2019లో కూడా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి ఉంటే మన రాజధాని మరింతగా అభివృద్ధి చెంది ఉండేదన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు.. రైతులు ఎన్ని ఇబ్బందులు పడ్డారో స్వయంగా చూసామన్నారు. రాజధాని మహిళలు అని కూడా చూడకుండా పోలీసులతో అత్యంత అమానుషంగా వ్యవహరించిన రోజులు ఇంకా కళ్ళ ముందే ఉన్నాయన్నారు. మొదలుపెట్టిన పనులు పూర్తి చేయకుండా రాజధాని ప్రాంతాన్ని ఓ అడవిగా మార్చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిది అయితే, అమరావతే రాజధానిని అభివృద్ధి పథంలో నడపడం చంద్రబాబు నాయుడు నైజమన్నారు. భవిష్యత్తులో ఎవరూ రాజధానిపై పిచ్చి నిర్ణయాలు తీసుకోకుండా ఉండేలా రాబోయే రోజుల్లో అభివృద్ధి రగబోతుందన్నారు. రాష్ట్ర రాజధాని కోసం సొంత భూములను త్యాగం చేసిన రైతు సోదరులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమన్నారు. అభివృద్ధి చెందుతుంటే.. అడ్డుకోవాలని వైసీపీ నాయకులు చూడడం దారుణమన్నారు. అటు సంక్షేమం ఇటు అభివృద్ధి రెండు కళ్లు అని చెప్పి సీఎం చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని పేర్కొన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.



మాట్లాడుతున్న డాక్టర్ లావు రత్తయ్య



విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఒడిదుడుకుల్ని అధిగమిస్తేనే నిజమైన జీవితం

విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): యువత ఒడిదుడుకుల్ని అధిగమిస్తేనే జీవితంలో గెలుస్తారని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నుంచి బీటెక్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభం సందర్భంగా.. ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌన్సెలింగ్‌లో తమ కళాశాలను ఎంచుకున్న విద్యార్థులకు, తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. కళాశాల పంచ సూత్రాలు (1.ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్, 2. ప్లానింగ్, ట్రైనింగ్, కమ్యూనికేషన్, 3. కౌన్సెలింగ్, 4. సీఆర్‌టీ తరగతులు, 5. బోధన పద్ధతి) వల్లే తమ దగ్గర చదివిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థా నాలను అధిరోహిస్తున్నారని లావు రత్తయ్య వివరించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఫిజికల్ ఫిట్‌నెస్‌కు క్రెడిట్స్‌ను అందిస్తు న్నామని వెల్లడించారు. వర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి మాట్లాడుతూ కౌన్సెలింగ్ సిస్టం ద్వారా ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడిని నియమిస్తామని చెప్పారు. దీంతో విద్యార్థులను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ.. నైపుణ్యాలను వెలికి తీసి పరిపూర్ణ వ్యక్తిత్వ నిర్మాణానికి తోడ్పడుతామన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఫణీంద్రకు మార్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్తే.. ఊడ్చేశారు!

122 గ్రాముల బంగారు నగలు, రూ.20 వేల నగదు చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

రెంటచింతల,ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రెంటచింతలలోని రేంజర్ వీధిలో(రైస్ మిల్ వద్ద) ఆదివారం రాత్రి టీచర్ల గృహంలో భారీ దొంగతనం జరిగింది. దంపతులిద్దరూ ఊరెళ్లడంతో.. దొంగలు ఇనుప రాడ్‌తో తాళాలు, బీరువాను పగలకొట్టి బంగారు ఆభరణాలు, నగదును దోచుకెళ్లారు. సేకరించిన వివరాల మేరకు.. గెల్లిపోగు జనార్దనరావు, సుమతి గ్రేస్ భార్యభర్తలు. జనార్దనరావు జెట్టిపాలెం మోడల్ స్కూల్‌లో ఎకనామిక్స్ అధ్యాపకుడిగా.. సుమతి గ్రేస్ స్థానిక విద్యాశాఖలో సీఆర్పీగా పనిచేస్తున్నారు. జనార్దన్ తల్లి మరియమ్మ అస్వస్థతకు లోనుకావడంతో.. పలకరించేందుకు..వారు మాచర్లకు వెళ్లారు. ఉదయం రెంట ఇంటికి వచ్చి చూడగా.. తాళాలు పగలకొట్టి తలుపులు, బీరువా తెరిచి ఉండడం గమనించారు. చోరీ జరిగినట్లు నిర్ధారించకున్నారు. బీరువాలో ఉంచిన శంకరాభరణం బుట్టలు, హ్యాంగర్స్, చైన్లు, ఉంగరాలు, కెంపుల పచ్చల బుట్టలు దాదాపు 122 గ్రామల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని తెలిపారు. అలాగే పాపకు టెన్త్‌లో మంచి మార్కులు రావడంతో పాఠశాల నుంచి వచ్చిన బహుమతి రూ.20 వేల నగదును పట్టుకుపోయారని తెలిపారు. ఘటన స్థలాన్ని కారంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున సందర్శించి బాధితుల నుంచి వివరాలను నమోదు చేసుకున్నారు. అలాగే గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గతంలో బావమరిది ఇంటిలో..

జనార్దన మాస్టార్ బావమర్ది ప్రసాద్ మాస్టర్ గృహంలో కూడా 2022 ఆగస్టు 19న దొంగతన జరిగింది. భార్యభర్తలిద్దరూ స్కూల్‌కు వెళ్లి ఇటికొచ్చేసరికి రూ.3.45 లక్షలు విలువైన బంగారం, నగలు అపహరించుకెళ్లారు. మిర్యాలగూడకు చెందిన నేరస్తుడిని అప్పటి ఎస్‌ఐ సమీర్ బాష పట్టుకుని కొంత సొమ్మును రికవరీ చేశారు.

రెంటచింతలలో తచ్చాడిన పాత నేరస్తులు

గతంలో దొంగతనాలకు పాల్పడి జైలు జీవితం గడిపి బయటకు వచ్చిన వారు మూడు రోజుల క్రితం రెంటచింతలలో సంచరించినట్లు సమాచారం. పగలు రెక్కీ..రాత్రిళ్లు చోరీలే వారి పని. ఈ ఏడాది ఫిబ్రవరి 17న మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి గృహంతో పాటు వ్యాపారి సాంబశివరాలు ఇంటిలోనూ చోరీ జరిగింది. అలాగే 2019 ఆగస్టు 11న రాము మాస్టారు ఇంటిలో చోరీ జరగ్గా సుమారు రూ.10 లక్షలు విలువైన బంగారం, నగదు అపహరణకు గురయ్యాయి. ఆ చోరీ మిస్టరీ నేటికి వీడలేదు.

షూటింగ్ బాల్ బాలబాలికల జిల్లా జట్లు ఎంపిక



షూటింగ్ బాల్ బాలబాలికల జిల్లా జట్లు

సత్తెనపల్లిరూరల్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో పల్నాడు జిల్లా జూనియర్ బాలబాలికల షూటింగ్ బాల్ జట్ల ఎంపికలు సోమవారం నిర్వహించారు. బాలురు 80, బాలికలు 60 మంది ఎంపికలకు హాజరయ్యారని జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముప్వ నరసింహా రావు, కొనంకి కిరణ్ కుమార్ తెలిపారు. ప్రతిభ ఆధారంగా జిల్లా జట్ల ను ఎంపిక చేసినట్లు చెప్పారు. వీరు ఈ నెల నెల్లూరు జిల్లా బుచ్చిరె డ్డిపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికలో వ్యాయమ ఉపాధ్యా యులు లాకు పిచ్చయ్య, బి.అనిల్‌దత్తా నాయక్, షేక్ మహబూబి, బి.తులసీరాం నాయక్, ఎ.చిన్నయ్య, తిరుపతమ్మ రత్నకర్, ప్రసన్న, శివరామక్రిష్ణ పాల్గొన్నారు.

బాలుర జట్టు: కె.వెంకట్, జి.నవీన్, పి.మోహన్, బి.రుషి, జి.వెంకటేష్, షేక్ అబ్దుల్, ఎం.హఫిద్, ఎం.మహీధర్, జె.ప్రవీణ్, జి.మంజీ, కె.సుధీర్, ఎస్.బార్గవ్

బాలికల జట్టు: ఎం.విజయపరిమళ, కె.హిమబిందు, జె.లక్ష్మీకీర్తన, జె.యశ్వస్వీని, పి.మేఘన, పి.సుచరిత, ఎం.నందిని, సీహెచ్ అక్షర, కె.హర్షిత, టి.సింధు, ఎం.జ్యోతిక, ఎస్.మధు.

బెదిరించి గ్రావెల్ తరలించారు

● అడ్డుకోబోతే చంపేస్తామన్నారు ● రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితులు



గ్రావెల్ తవ్వకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మధుబాబు, రెవెన్యూ అధికారులు

పిడుగురాళ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అధికారం అండ చూసుకొని కొందరు వైసీపీ నేతలు రెచ్చిపోయారు. దళితుల భూములలో మట్టి తవ్వకాలు జరిపి జేబులు నింపుకున్నారు. కాదని అడ్డొస్తే చంపేస్తా మని బెదిరించారు. కోనంకికి చెందిన దళితులు తెలిపిన వివరాల ప్రకారం.. 2013లో 7వ విడత జన్మభూమిలో కోనంకి సర్వే నెంబరు 236/19లో సుమారు 21 మంది దళితులకు ఒక్కొక్కరికి ఎకరం చొప్పు న అప్పటి టీడీపీ హయాంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చేతులమీదుగా భూ పంపిణీ చేయడం జరిగింది. భూమి సాగు చేసు కుంటూ జీవిస్తున్న వారి భూముల్లో 2019-24 మధ్య కొందరు వైసీపీ నేతలు దళితులకు పంపిణీ చేసిన భూమిలో గ్రావెల్‌ను అక్రమంగా తొవ్వి పిడుగురాళ్ల సమీపంలోని అద్దంకి-నార్కె ట్‌పల్లి రాష్ట్ర రహదారి నిర్మాణానికి తోలించారు. తమ భూముల్లో మట్టి ఎందుకు తొవ్వుతు న్నారని దళితులు అడుగగా.. బెదిరింపులకు పాల్పడటమే కాకుండా అడ్డొచ్చిన వారిని పక్కకు నెట్టేసి గ్రావెల్‌ను వందల ట్రక్కులను తర లించారని బాధితులు లంజేపల్లి సువర్ణ, చినమార్తమ్మ, పెదమార్తమ్మ, ఆలేటి కోటమ్మ, లంజేపల్లి లేయమ్మ, నందిపాటి దుర్గమ్మలు రెవెన్యూ అధికారులకు తవ్వకాలు జరిపిన ఆనవాళ్లతో గత నెలలో ఫిర్యాదు చేశారు. దళితులే కాకుండా మరి కొంత మంది మిలటరీలో పనిచేసిన వ్యక్తులకు కూడా అక్కడ భూములు కేటాయించడం జరిగింది. బాధి తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం పిడుగురాళ్ల తహసీల్దార్ మధుబాబు, సర్వేయరు వెంకటేశ్వర్లు, ఇతర రెవెన్యూ అధికారులు దళితులకు కేటాయించిన భూముల్లో జరిపిన తవ్వకాలను పరిశీలించారు. పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తగా ఉండాలి

నరసరావుపేట లీగల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులపై డీజీపీ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు ఎస్పీ కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. సోమవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు డ్రంక్ అండ్ డ్రైవ్, 11 నుంచి 17వ తేదీ వరకు ఓవర్ స్పీడ్, 18 నుంచి 24వ తేదీ వరకు హెల్మెట్ ధారణ, 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అన్ని రకాల ఉల్లంఘనలపై బ్లాక్ స్పాట్లలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించింది.

10న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

గుంటూరు(తూర్పు), ఆగ స్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ర్యాకింగ్ చదరంగం పోటీలు ఈ నెల 10న లాం డీల్లీ పబ్లిక్ స్కూ ల్లో నిర్వహిస్తున్నట్లు టోర్న మెంట్ డైరెక్టర్ వైవీకే చక్రవర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-6, 8, 10, 12, 14, 16 బాల బాలికల విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి కల్గిన క్రీడాకారులు ఈ నెల 8లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలి పారు. మొదటి పది స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు, సర్టిఫికెట్స్ ప్రదానం చేస్తామన్నారు. వివరాలకు 90631 42105 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

ఇదేంది 'రొయ్యా'.. ట్రంపు!

(5వ పేజీ తరువాయి)

భారం ఎగుమతిదారులపై పడనుంది. ఈ ప్రభావం అంతిమంగా రొయ్య రైతుల మీదే పడి మార్కెట్‌లో ధరలు మరింత క్షీణత నమోదయ్యే అవకాశాలున్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఏప్రిల్‌లోనే వేగంగా ధరల పతనం...

ఏప్రిల్‌లో ట్రంప్ తీసుకున్న సుంకాల నిర్ణయంతో గంటల్లోనే రొయ్యల ధరల్లో పతనం నమోదైంది. రూ.240 ఉన్న వంద కౌంట్ రొయ్య ధర ఏప్రిల్‌లో ట్రంప్ ప్రకటనతో ఒక్కసారిగా రూ.45 పతనమై రూ.195కు చేరింది. అన్ని రకాల రొయ్యల ధరల్లో కనిష్ఠంగా రూ.30, గరిష్ఠంగా రూ.50 తగ్గుదల అప్పట్లో నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పరిస్థితి తీవ్రతను కేంద్రం ద్వారా అమెరికా దృష్టికి తీసుకెళ్లి పన్నుల బాదుడును మూడు నెలల పాటు వాయిదా వేయించగలిగింది. దీంతో ఆక్వా రైతులతో పాటు ఎగుమతిదారులు కూడా కొంతమేర ఊపిరి పీల్చుకున్నారు. కానీ తాజాగా ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో సుంకాల వ్యవహారం మళ్లీ మొదటికొచ్చినట్లయింది. పది రోజుల కిందట వంద కౌంట్ రొయ్యల ధర రూ.260 ఉండగా, ప్రస్తుతం రూ.35 వరకు క్షీణత నమోదైంది. ఈ పతనం మరింతగా కొనసాగే అవకాశాలు కనబడుతుండ డంతో ఆక్వా రైతులు రాబోయే నష్టాలను తలచుకుని విలవిల్లాడుతున్నారు.

స్థానిక వినియోగం పెంచడమే మార్గం

రొయ్యలకు స్థానిక వినియోగం పెంచడమే లక్ష్యంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర మార్ట్స్ రాజకీయ దోపిడీకి కేంద్రాలుగా మారాయి తప్పితే ఆక్వా రంగానికి ఒనగూరిన మేలు గుండుసున్నా. ఇక్కడ ఉత్పత్తి అయ్యే రొయ్యల్లో దాదాపు 80 శాతం ఎగుమతుల బాటే పడుతున్నాయి. ఇలాంటి పన్నుల సంక్షోభాలు ఎదురైనప్పుడు ఆక్వా రంగం బేల చూపులు చూడకుండా ఉండాలంటే ఉత్పత్తుల్లో కనీసం 50 శాతం స్థానిక వినియోగం ఉండేలా ప్రభుత్వాలు కృషి చేయాలి. నేరుగా రొయ్యలు, చేపలు వాడడమే కాకుండా వాల్యూ యాడెడ్ దిశగా ప్రాసెసింగ్ రంగాలకు రాయితీలు ఇచ్చి.. మార్కెట్‌లో ప్రవేశపెడితే కొంతమేర ప్రయోజనం ఉండే అవకాశం ఉంది. ఇదే కాకుండా మత్స్య ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే లాభాలపై కూడా పెద్ద ఎత్తున ప్రచారం కల్పించి ప్రజల్లో వినియోగాన్ని పెంచడంపైనే ఆక్వా రంగం మనుగడ ఆధారపడి ఉంటుంది.

రాజధాని రైతులకు 'రిటర్న్' గిఫ్ట్!

(5వ పేజీ తరువాయి)

వారంతా బ్యాంకు రుణాల కోసం చేయని ప్రయత్నం లేదు. కానీ, బ్యాంకర్లు ససేమిరా అన్నారు. దీనికి తోడు భూములు ప్రభుత్వానికి ఇవ్వడంతో వాటిపై సహకార రుణాలు పొందే అవకాశం లేకుండాపోయింది. దీంతో రైతులు నరకం అనుభవించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వారి 'రుణ' కష్టాలు కొనసాగాయి. ఈ విషయం సీఎం దృష్టికి కూడా వెళ్లింది. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

● ముందుకొచ్చిన లీడ్ బ్యాంకు

రిటర్నబుల్ ప్లాట్లపై రుణాలివ్వాలని లీడ్ బ్యాంకు అయిన యూనియన్ బ్యాంకు తాజాగా జిల్లాలోని అన్ని బ్రాంచ్‌ల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రుణ మంజూరుకు ఈ ఏడాది ఫిబ్రవరిలోనే బ్యాంకులు ఆమోదం తెలిపాయి. ఫిబ్రవరిలో జరిగిన ఎస్‌ఎల్‌బీసీలో రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు అంగీకరించారు. కానీ, రుణాలివ్వడానికి ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో నెలన్నర క్రితం ఉండవల్లిలో సీఎం నిర్వహించిన సమావేశంలో రైతులు తమ గోడు వినిపించారు. తాజాగా జూలై 25న సబ్ కమిటీ సమావేశంలో ప్లాట్లపై రుణాలు ఇవ్వాలని తీర్మానించారు. ఈ తీర్మానం ఆధారంగా లీడ్ బ్యాంకు ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాల మేరకు బ్యాంకర్లు ముందుకు రావాలని రైతులు కోరుతున్నారు.

రేపటి నుంచి మాచర్ల - విజయవాడ ప్యాసింజర్ వేళల్లో మార్పు

గుంటూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నిత్యం మాచర్ల - విజయవాడ మధ్యన ప్రయాణించే 67228 ప్యాసింజర్ రైలు వేళల్లో రైల్వే శాఖ మార్పు చేసినట్లు డీఆర్ఎం సుధేష్ణ సేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఈ రైలు మాచర్లలో ఉదయం 5.30కి బయలుదేరుతుండగా ఈ నెల 6వ తేదీ నుం చి ఉదయం 6కు ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. ఆ తర్వాత 6.20కి రెంటచింతల, 6.32కి గురజాల, 6.48కి నడికుడి, 7.02కి తుమ్మలచెరువు, 7.13కి పిడు గురాళ్ల, 7.20కి బెల్లంకొండ, 7.27కి రెడ్డిగూడెం, 7.39కి సత్తెనపల్లి, 7.52కి పెదకూరపాడు, 8 గంటలకు సిరిపురం, 8.08కి బండారుపల్లి, 8.18కి నల్లపాడు, 8.30కి గుంటూరు, 8.39కి పెదకాకాని, 8.52కి నంబూరు, 9.34కి మంగళగిరి, 9.54కి కృష్ణాకెనా ల్, 10.55కి విజయవాడ చేరుకొంటుందన్నారు. ఈ మార్పుని ప్రయాణికులు గమనించాలన్నారు. మాచర్ల - గుంటూరు మధ్యన ఈ రైలు వేగాన్ని పెంచినట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

45,996 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 48,484 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,996 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,699 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	11000
334	9500	13500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13300	334	9500	13000
273	10000	12600	నెంబరు. 5	10000	13400
341	10000	14000	273	10500	12800
4884	---	----	341	10000	14800
సూపర్ 10	---	----	4884	10000	12700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	12200
బ్యాడిగి	10000	12800	దేవనూరు డీలక్స్	---	----
దేవనూరు డీలక్స్	10000	12500	తాలుకాయలు	5000	7000

రోడ్డు నిర్మాణానికి మంత్రికి వేగేశన ప్రతిపాదనలు



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి ప్రతిపాదన పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల నియోజకవర్గంలోని కర్లపాలెం నుంచి పెదపులుగువారిపాలెం రోడ్డు పరిస్థితిని వివరించి నూతన రోడ్డు నిర్మాణం కొరకు తగిన నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరుతూ ప్రతిపాదనలను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సోమవారం రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డిని వెలగపూడి సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అందజేశారు.

అర్జీదారుల సమస్యలు నిర్ణీత గడువులో పరిష్కరించాలి

● ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అర్జీదారుల సమస్యలు నిర్ణీత గడువులోపు చట్ట పరిధిలో పరిష్కరించాలని ఎస్పీ తుషార్ డూడి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను స్వయంగా ఎస్పీకి విన్నవించుకున్నారు. అర్జీదారుల సమస్యలు విని ఇచ్చిన అర్జీలను పరిశీలించి వెంటనే సంబంధిత పోలీసుఅధికారులకు ఫోన్ చేసి మాట్లాడి అర్జీలను చట్టపరిధిలో త్వరితగతిన విచారించి నిర్ణీత గడువులోపు సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను చట్టపరిధిలో త్వరితగతిన విచారించి నిర్ణీత గడువులోపు సమస్య పరిష్కారం చూపని యెడల సంబంధిత పోలీసు అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పోలీసు అధికారులను హెచ్చరించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీలు, భూవివాదాలు ఇతర సమస్యలు గురించి 67 మంది అర్జీదారులు తమ సమస్యలు విన్నవించుకున్నారు. వాటిని సంబంధిత పోలీసు అధికారులకు పంపటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడి

ప్రజా సమస్యల పరిష్కారవేదికకు ఐదు అర్జీలు

కర్లపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఐదు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ షాకీర్ పాషా తెలిపారు. మండలంలోని ప్రజలందరూ ప్రజా సమస్యల పరిష్కారవేదికను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, ఇన్‌చార్జి ఎంపీడీవో ఐనంపూడి శ్రీనివాసరావు, ఎంఈవో టియు మనోరంజని, సర్వేయర్ శ్రీరామమూర్తి, వ్యవసాయ విస్తరణాధికారి భాగ్యలక్ష్మి, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్న తహసీల్దార్ షాకీర్ పాషా, పాల్గొన్న అధికారులు

డీడీవో ఆఫీస్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం ఓఎస్డీ

బాపట్లరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కార్యాలయాన్ని డిప్యూటీ సీఎం ఓఎస్డీ కె.వెంకటకృష్ణ సోమవారం సందర్శించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. రెవెన్యూ శాఖలో ఆర్డీవో మాదిరిగా పంచాయతీరాజ్‌శాఖలో డీడీవో పరిపాలన, అభివృద్ధి, సంక్షేమం, పర్యవేక్షణ, ఎన్నికల నిర్వహణలాంటి కీలకమైన విధులను కూడా నిర్వహించాల్సి ఉంటుందని, డివిజన్ పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉండేలా సర్వసౌకర్యాలతో తమ కార్యాలయాలను తీర్చిదిద్దాలని ఓఎస్డీ వెంకటకృష్ణ సూచించారు. పంచాయతీరాజ్ వ్యవస్థలన్ని గ్రామీణ పేద ప్రజలకు మరింత చేరువ చేసి వారిని అభివృద్ధి చేసేందుకు డీడీవోకి ఎక్కువ అధికారాలిచ్చి సదరుపోస్ట్‌ని శక్తివంతంగా తీర్చిదిద్దటం జరుగుతుందని, అధికారులందరు అంకితభావంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈటీసీ ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు, జడ్పీ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ, ఈఈపీఆర్ వేణుగోపాల్‌రెడ్డి, బాపట్ల, రేపల్లె, చీరాల, డీడీవోలు విజయలక్ష్మి, పద్మ, పద్మావతి, బాపట్ల ఎంపీడీవో బాబురావు, డీఈపీఆర్‌పీ రాజన్న, ఏఈ పీఆర్ మోహనరావు పాల్గొన్నారు.



అధికారులకు పలు సూచనలు చేస్తున్న డిప్యూటీ సీఎం ఓఎస్డీ వెంకటకృష్ణ

రైతుల సమస్యలను పరిష్కరించాలి : మేరుగు

బాపట్ల రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో యూరియా, ఎరువుల కొరత తదితర రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్‌కు వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో విలేకర్లతో మాట్లాడుతూ ఏ రైతుకు గిట్టుబాటు ధర దొరకటంలేదని, రైతులకు వెంటనే ఎరువులను అందుబాటులో ఉంచాలని, యూరియా కొరతను వెంటనే నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, పర్చూరు వైసీపీ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి, వైసీపీ రాష్ట్ర నాయకులు మోదుగుల బసవపున్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఆవరణలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున

వ్యర్థ జలాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

బాపట్ల రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రొయ్యల కంపెనీల నుండి వెలువడుతున్న విషవాయువులు, వ్యర్థజలాలు వల్ల ఆరోగ్య, పర్యావరణ హానిపై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు ఇచ్చినట్టు కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం, బోలాయిపాలెం, దిండివారిపాలెం, పిట్టలవానిపాలెం మండల పరిధిలోని ఖాజీపాలెం, పోతనకట్టవారిపాలెం గ్రామాల ప్రజలు తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో ఆయా గ్రామాల ప్రజలు విలేకర్లతో మాట్లాడుతూ తమ గ్రామాల సమీపంలో ఉన్న మెరైన్ కంపెనీల ద్వారా వెలువడే విషవాయువులు, వ్యర్థజలాలు తాగు, సాగుభూములలో ప్రవహించటంతో ఇటు పంటలు చెడిపోవటం ప్రజల ఆరోగ్యం దెబ్బతినటం జరుగుతున్నదన్నారు. సమస్యకు పరిష్కారం చూపాలని కలెక్టర్‌కు ఫిర్యాదు ఇవ్వటం జరిగిందన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారంలో బాధ్యతతో వ్యవహరించాలి : కలెక్టర్



కార్యక్రమంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోవటం జరుగుతుందని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 205 వినతులు అందగా పలు సమస్యలకు తక్షణమే పరిష్కారమార్గం చేశారు. మిగిలిన వాటిని సంబంధితశాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీ4 కార్యక్రమంలో బంగారు కుటుంబాలను మార్గదర్శులకు మ్యాపింగ్, దత్తతు చేయటంలో కలెక్టర్ మండల ప్రత్యేకాధికారులకు, మండలస్థాయి అధికారులకు పలుసూచనలు చేశారు. కేంద్రప్రభుత్వం ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హర్‌ఘర్ తిరంగ అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని మొదటి విడతగా ఆగస్టు 2 నుంచి 8వ తేది వరకు, రెండోవిడతగా 9 నుంచి 12వ తేదీ వరకు, మూడోవవిడతగా 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆక్వా ప్రాసెసింగ్ సెంటర్‌లు, గ్రానైట్, మైనింగ్, గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ మొదలగు పారిశ్రామిక కేంద్రాలలో, వాణిజ్య కేంద్రాలలో పనిచేస్తూ చట్టపరిధిలోకి వచ్చే ప్రతి కార్మికునికి రిజిస్ట్రేషన్ చేయించాలని కలెక్టర్ జిల్లాకార్మికశాఖాధికారికి పలుసూచనలు చేశారు. జిల్లాలో ఏ షాపులో కూడా యూరియా కొరత లేకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ వ్యవసాయశాఖాధికారికి సూచనలు చేశారు. పిల్లలను దత్తతు తీసుకోదలిచిన తల్లిదండ్రులు చట్టపరంగా మాత్రమే దత్తతు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ గంగాధర్‌గౌడ్, పీడీ డీఆర్‌డీఏ శ్రీనివాసరావు, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిష్కారవేదికను సద్వినియోగం చేసుకోవాలి



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

రేపల్లె, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదిక నిర్వహించారు. రేపల్లె మండలంలోని పోటుమెరక గ్రామానికి చెందిన అమ్మిశెట్టి సంజయ్ అసైన్డ్‌ల్యాండ్ తన తండ్రికి మంజూరు చేశారని సదరు ల్యాండ్‌ను 22ఏ లిస్టు తొలగించి వారి పేరుమీద ఆన్‌లైన్ చేయాలని కోరారు. పట్టణానికి చెందిన కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు ఆర్ అండ్ బీ రహదారిపై దమ్ముచక్రాలు తిరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యాధులు, రోగనిర్ధారణలో ఐక్యంగా సమరం పూరిద్దాం

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ

బాపట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మలేరియా, డెంగీ, బోధకాలు, టైఫాయిడ్ లాంటి వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలోనే ప్రభావవంతమైన చర్యలను తీసుకుందామని, తదనుగుణంగా సిబ్బంది సహకరించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ అన్నారు. స్థానిక బాపట్ల ఎన్జీవోహోమ్‌లో ల్యాబ్‌టెక్నిషియన్‌ల నెలవారి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్ మాట్లాడుతూ ముఖ్యంగా అపరిశుభ్రంగా ఉన్న ప్రత్యేక ప్రాంతాలలో సంబంధిత పంచాయతీ, మున్సిపల్ అధికారులతో మాట్లాడి సంఘటితంగా వ్యాధులను కట్టడి చేస్తామని త్వరలో ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో క్షేత్రస్థాయి సిబ్బంది జ్వరాలను గుర్తించటంలో, ఖచ్చితమైన జ్వర అనుమానిత రక్తపూత నమూనాలు సేకరించి సంబంధిత ఆరోగ్య కేంద్ర ల్యాబరేటరీకి నిర్దేశ్యాల ప్రకారం అందించాలన్నారు. ఫ్రైడే డ్రైడేను సమర్ధవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైన వైద్యసిబ్బంది అలసత్వం వహిస్తే ఉపేక్షించబోనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ల్యాబ్ టెక్నిషియన్‌లు, సబ్‌యూనిట్ అధికారులు, హెల్త్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఎరువుల చట్టంపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి ఎం.సుబ్రహ్మణ్యేశ్వరరావు

బాపట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని మండలాలలో ఉన్న ఎరువుల వ్యాపారస్థులకు ఎరువుల చట్టంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎన్.సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ ఎరువులు అమ్మిన వెంటనే ఈపాస్‌లో వాటి అమ్మకాలను నమోదు చేయాలని తెలిపారు. వ్యాపారస్తులందరూ విత్తనచట్టం 1983, ఎరువుల చట్టం 1985, అదేవిధంగా పురుగుమందుల చట్టం 1968 గురించి పూర్తిగా తెలుసుకొని వ్యాపారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘాల సీఈవోలు, డీసీఎంఎస్ సీఈవో ప్రైవేట్ డీలర్స్, మండల వ్యవసాయాధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంఫాక్ట్ ఇంటర్నేషనల్ రివిజనల్ డైరెక్టర్‌గా సాంబయ్య



బి.సాంబయ్య

కర్లపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం పెదగొల్లపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొమ్మనబోయిన సాంబయ్య అంతర్జాతీయ ఇంఫాక్ట్ సంస్థలో బాపట్ల క్లబ్ నుంచి రివిజినల్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. బొమ్మనబోయిన సాంబయ్యను రివిజినల్ డైరెక్టర్‌గా ఎంపికైనట్లు జాతీయ ఉపాధ్యక్షుడు గిరిప్రసాద్ తెలిపారు. విద్యార్థులు, వ్యాపారస్తులు, యువతకు నైపుణ్యాభివృద్ధి కలిగించటంలో ఇంఫాక్ట్ సంస్థ కృషి చేస్తుందన్నారు. సాంబయ్య రివిజనల్ డైరెక్టర్‌గా ఎంపికైనందుకు మండలంలోని పలువురు నాయకులు మాడా శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ తాతా లీలా వరప్రసాదరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పెదమల్లు రంగారావు, జనసేన మండల అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ, రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు తిమ్మరాజు వెంకటసుబ్బారావు, కార్యదర్శి చందు పిచ్చయ్య, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు ఇనకొల్లు పోలీసురావు, పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు అభినందనలు తెలిపారు.

రైతులకు అందుబాటులో యూరియా, డీఏపీ

పిట్టలవానిపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరు, కోమలి, పిట్టలవానిపాలెం గ్రామాలలో పీఏసీఎస్‌లకు ఈ ఏడాది ఇప్పటికే సుమారు 80 టన్నుల యూరియా, 30 టన్నుల డీఏపీ ఆయా సొసైటీలకు వచ్చినట్లు మండల వ్యవసాయశాఖాధికారి సీహెచ్ సత్యానంద్ తెలిపారు. మండలంలో ఇప్పటికే ఆయా రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతులు వరి నాట్లకు సిద్ధమౌతున్నారు. కొన్నిచోట్ల వెదపద్దతి వైపు దృష్టిపెట్టారు. దీంతో ఆయా గ్రామాలలో వరినారు మడులు పెరుగుతున్నాయని ఏవో తెలిపారు.

అట్టహాసంగా శ్రీపోలేరమ్మతల్లి జాతర



శ్రీపోలేరమ్మతల్లి కొలుపులు నిర్వహిస్తున్న భక్తులు

బాపట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఒకటవ వార్డు రామకృష్ణపురం మహాలక్ష్మి అమ్మవారి చెట్టు వద్ద శ్రీ పోలేరమ్మ తల్లి కొలుపులు సోమవారం ఎంతో ఘనంగా జరిగాయి. మొదటి రోజు అమ్మవారికి వైభవంగా ఉత్సవాన్ని ఒక పండుగ వాతావరణం కల్పించేలా గ్రామస్తులు నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్ళు సమర్పించి మేళతాళాలతో డప్పుచప్పుళ్ళతో, కళాకారులతో అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అనంతరం అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కోలాట ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నాదెండ్ల రాంబాబు, నామేపల్లి లక్ష్మీనారాయణ, శంకవరపు రాంబాబు, పెద్ద వెంకట్రావు, చిన వెంకట్రావు, ప్రత్తిపాటి సాయికృష్ణ, వినుకొండ శ్రీను, కొండవీటి శ్రీను పాల్గొన్నారు.

వీరజవాన్ల కుటుంబాలకు 15 లోగా ఇళ్ల పట్టాలు

● తహసీల్దార్ శ్రీనివాసరావు

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : వీరజవాన్ల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఈనెల 15 లోగా మంజూరు చేస్తామని తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశ రక్షణకై పని చేసి యుద్ధంలో మరణించిన సైనికుల కుటుంబాలకు వార్‌డెత్ కింద ఇళ్ల స్థలాలు కేటాయించి ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున కలెక్టర్ సమక్షంలో పట్టాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ శాంతలక్ష్మి, సీనియర్ సహాయకులు ప్రసన్నకుమారి, వీఆర్వోలు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి

చెరుకుపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్న 530కిపైగా సేవలు గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి నెల 5వ తేదీ గ్రామ సచివాలయాల పరిధిలో సచివాలయం ఉద్యోగులు ర్యాలీ నిర్వహించాలని గ్రామ, వార్డు సచివాలయం శాఖ వారు ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో షేక్‌మహబూబ్ సుభాని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కరకట్టపై వ్యర్థాలు, చెట్లు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కరకట్టపై వ్యర్థాలు, రోడ్లపై విస్తరించిన చెట్లను అధికారులు ఎట్టకేలకు తొలగింపజేశారు. కొల్లూరు లాకుల వద్ద నుంచి దోనేపూడి వరకు కరకట్ట మార్గం మొత్తం పిచ్చిచెట్లు రోడ్డుపైకి రావడంతో వాహనాలు తప్పుకునే వీలు లేకపోవడంతో ప్రమాదాలకు కారణమైంది. పైగా లాకుల వద్ద కరకట్టపై వ్యర్థాలు వేయడంతో అక్కడ కూడా మార్గం కుచించుకుపోవడంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'మూసుకుపోయిన మార్గం.. ప్రయాణం ఎలా' అనే కథనం ప్రచురించడంతో అధికారులు స్పందించారు. కొల్లూరు లాకుల వద్ద నుంచి దోనేపూడి వరకు చెట్లు తొలగించి మార్గాన్ని విస్తరించే పనులకు సోమవారం ఉపక్రమించారు. దీంతో రెండు వాహనాలు కరకట్టపై ఎటువంటి ఇబ్బంది లేకుండా తప్పుకునే అవకాశం ఏర్పడి ప్రయాణానికి సుగమంగా మారింది.



కరకట్టపై ఉన్న వ్యర్థాలను తొలగిస్తున్న యంత్రం

మున్నం నాగేశ్వరరెడ్డి మృతి టీడీపీకి తీరనిలోటు

బాపట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 24వ వార్డు డ్రైవర్స్ కాలనీకి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మున్నం నాగేశ్వరరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. నాగేశ్వరరెడ్డి పార్థివదేహానికి నరేంద్రవర్మ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారి కుటుంబానికి భరోసాను కల్పించి తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో బాపట్ల మార్కెట్ యార్డు ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, కుట్టుబోయన రమేష్, కుక్కల శ్రీనివాసరెడ్డి, రామిరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.



నాగేశ్వరరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ

చిట్టెమ్మ మృతికి టీడీపీ నేతల సంతాపం

కొల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామ టీడీపీ అధ్యక్షుడు ముమ్మనేని మురళీ మాతృమూర్తి ఆదివారం రాత్రి కన్నుమూశారు. మండల పరిధిలోని తడికలపూడి గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా సేవలు అందిస్తున్న మురళీ మాతృమూర్తి చిట్టెమ్మ (85) అనారోగ్యంతో కన్నుమూసిన సమాచారం తెలుసుకున్న టీడీపీ నాయకులు మైనేని మురళీకృష్ణ, క్రాప పీఏసీఎస్ అధ్యక్షుడు కోగంటి హరిప్రసాద్, జువ్వలపాలెం మాజీ సర్పంచ్ యార్లగడ్డ శ్రీనివాసరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త వేములపల్లి రవికిరణ్‌లు సోమవారం ఉదయం మురళీ స్వగృహానికి వెళ్లి ఆయన తల్లి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



చిట్టెమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మురళీకృష్ణ సొసైటీ అధ్యక్షుడు హరిప్రసాద్



కుళాయి కనెక్షన్లను ప్రారంభిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

చెరుకుపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జాతీయ జలజీవన్‌మిషన్ పథకంలో భాగంగా చెరుకుపల్లి మండలంలో జొన్నలగడ్డవారిపాలెం, కుంచెలవారిపాలెం గ్రామాల్లో వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం భూమి పూజ నిర్వహించారు. జొన్నలగడ్డవారిపాలెం గ్రామ పంచాయతీలో కొత్త పైప్‌లైన్, ఇంటింటికి కొత్త కుళాయి కనెక్షన్‌ను అందించడం కొరకు, జేజేఎం గ్రాంట్ కింద అంచనా వ్యయం రూ.79.14 లక్షలు, కుంచాలవారిపాలెం గ్రామపంచాయతీలో 90 కేఎల్ ఏహెచ్ఎస్ఆర్ సామర్థ్యం గల నీటి నిల్వ ట్యాంక్ నిర్మాణం, కొత్త పైప్‌లైన్, ఇంటింటికి కొత్త కుళాయి కనెక్షన్ అందించడం కొరకు జేజేఎం గ్రాంట్ కింద అంచనా వ్యయం రూ.82.50 లక్షలతో పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘాల ఛైర్మన్ ఎం.రాధాకృష్ణమూర్తి, టీడీపీ నాయకులు కొనకాల రవికిరణ్, పూషడపు కుమారస్వామి, మల్లాది రామకృష్ణ, చెల్లి రవికుమార్, శౌంతి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లలో పని చేయని ఫోన్లు

● సీడీపీవో కార్యాలయాల్లో అందజేత

రేపల్లె, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ సెంటర్‌లో వైసీపీప్రభుత్వంలో ఇచ్చిన ఫోన్‌లు ఫొటోట్రాకర్ బాలసంజీవని యాప్‌లకు సపోర్టు చేయటం లేదని, ఫోన్‌లు వెనక్కి ఇస్తున్నామని ఏఐటీయూసీ బాపట్ల జిల్లా కన్వీనర్ సింగం వాణిశ్రీ అన్నారు. పట్టణంలోని సీడీపీవో కార్యాలయం వద్ద సోమవారం పని చేయని ఫోన్‌లతో నిరసన తెలిపి సీడీపీవో కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొబైల్ నెట్‌వర్క్ సిగ్నల్ లేకపోవటం, ఇచ్చిన యాప్ సర్వర్లు పని చేయకపోవటంతో నానా ఇబ్బందులకు గురౌవుతున్నామని, దీని కారణంగా ఉన్నతాధికారుల వద్ద మాటలు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం దృష్టిసారించి ఏడబ్ల్యూసీ నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలని, 5జీ నెట్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, భవాని, పద్మావతి, ప్రమీల, బాజీ, త్రివేణి, నాగలక్ష్మి, కవిత, అరుణ పాల్గొన్నారు.



ఫోన్లు పని చేయటం లేదని చూపిడుతున్న అంగన్‌వాడీ వర్కర్స్

● యాప్స్‌భారం, ఆన్‌లైన్ వర్క్, ఎఫ్ఆర్ఎస్ చేయలేక అనారోగ్యం బారిన పడుతున్న అంగన్‌వాడీలు ఫోన్‌లు తిరిగి ప్రాజెక్టు కార్యాలయాల్లో ఇచ్చేస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద పని చేయని ఫోన్‌లతో సోమవారం నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు కె.ఝాన్సీ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు అనేక రకాల యాప్స్ తీసుకువచ్చి పనిభారం పెంచారన్నారు. ప్రభుత్వం వెంటనే 5 జీతో కూడిన నూతన ఫోన్‌లు ఇవ్వాలని, ఆన్‌లైన్ పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.రత్నకుమారి, కృష్ణకుమారి, జ్యోతి, నిర్మల, శివలక్ష్మి పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫారం పొడిగించాలని ఎమ్మెల్యేకు వినతి

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్ ఫ్లాట్‌ఫారం పొడిగించాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు భట్టిప్రోలు మండల టీడీపీ నాయకులు వినతి పత్రం అందించినట్లు సోమవారం తెలిపారు. మండల కేంద్రం భట్టిప్రోలు రైల్వేస్టేషన్ నుంచి నిత్యం ప్రయాణికులు సికింద్రాబాద్-గుంటూరు రైళ్లలో ప్రయాణాలు చేస్తుంటారు. డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలు 21 భోగీలు కలిగి ఉంటుందని, ప్రయాణీకులు రైలు ఎక్కేందుకు ప్లాట్‌ఫారం సరిపడా లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. భట్టిప్రోలు రైల్వే స్టేషన్ నుంచి ప్రధాన రహదారికి వెళ్లే రోడ్డు పల్లం కావడంతో వర్షపు నీరు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు ఎత్తు పెంచి నిర్మాణం చేయాలని కోరుతూ గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉదయభాస్కరి, మండల కన్వీనర్ వాకా శేషుబాబు, ఉపాధ్యక్షుడు నూతక్కి దినకర్‌బాబు, ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల లెనిన్, భట్టిప్రోలు పీఏసీఎస్ అధ్యక్షులు పరుచూరి రమేష్, డీసీ అధ్యక్షులు కరుణశ్రీనివాసరావు, క్లష్టర్ కన్వీనర్ మోటూరి పుణ్యశ్రీనివాసరావు, బట్టు మల్లికార్జునరావు, కనపర్తి సుందరరావు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భట్టిప్రోలు రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కేందుకు ఇబ్బందులుపడుతున్న ప్రయాణికులు

గృహ సందర్శన ద్వారా గర్భిణులకు అవగాహన

వేమూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాల వారోత్సవాలలో భాగంగా సోమవారం వేమూరులో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి ఆధ్వర్యంలో గృహ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు జరిపి పోషకాహార పదార్థాలను అందజేశారు. గర్భవతిగా ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బీపీ పరీక్షలు చేసి బరువు, రక్తశాతం, ఆల్బామిన్ షుగర్, పొట్ట చుట్టూ కొలత, పాదాల ఉబ్బుదల తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ, గర్భవతులు ఏడు రకాల పరీక్షలను ఎప్పటికప్పుడు గమనించుకుంటూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ స్వాతి, అంగన్‌వాడీ కార్యకర్త ధనమణి, ఆషాకుమారి తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు పోషక ఆహార పదార్థాలు అందజేస్తున్న సూపర్‌వైజర్ అమృతవాణి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చెరుకుపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గూడవల్లి సబ్‌స్టేషన్‌కు సంబంధించిన 33/11 కేవీ గూడవల్లి ఫీడర్‌కు మరమ్మతుల నిమిత్తం గూడవల్లి, గుళ్ళపల్లి, పొన్నపల్లి ఆదిశంకర వ్యాలీ, దాని పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేయబడుతుందని ఏడీఈ సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.



తరువుతీరా.. చిగురించు!

స్థానిక స్వామి థియేటర్ సమీపంలో ఓ చెట్టు పూర్తిగా ఎండిపోవడంతో పైకొమ్మల వరకు నరికి వేశారు. అయితే తిరిగి దానికి పునరుజ్జీవం పోసి చిగురింప చేయడానికి స్థానికులు ప్రయత్నిస్తున్నారు. చెట్టు మొత్తం గోతాలు చుట్టి ఇలా సంరక్షిస్తున్నారు. మోడు వారిన ఈ చెట్టు కొత్త చిగుళ్లతో కళకళలాడుతుందో లేదో వేచి చూడాలి మరి.

- గుంటూరు (ఆంధ్ర జ్యోతి)

త్రికరణ శుద్ధిగా.. హర్ ఘర్ తిరంగా



- ● మూడు దశల్లో కార్యక్రమాల నిర్వహణ
- ● ప్రతీ ఇంటిపై జాతీయ జెండా రెపరెపలు..
- ● ర్యాలీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మానవ హారాలు
- ● జిల్లా స్థాయిలో ఒక భారీ కార్యక్రమానికి ఆదేశాలు

గుంటూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మూడేళ్లుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తోన్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ఈ నెల 8వ తేదీ వరకు తొలి దశ, 9 నుంచి 12వ తేదీ వరకు రెండో దశ, 13 నుంచి 15వ తేదీ వరకు మూడో దశ హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించింది. జిల్లాకు నోడల్ ఆఫీసర్‌గా స్టెప్ సీఈవో చంద్రమునిని నియమించారు. జెండా ఆవిష్కరణలు, తిరంగా ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించాలని ఆదేశించింది. విద్యా సంస్థలు, స్వయం సహాయక బృందాలు, యూత్ క్లబ్‌లు, స్థానిక సంస్థలను సమీకరించాలని సూచించింది. సెల్ఫీ విత్ తిరంగా కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని.. ఇందుకోసం హర్‌ఘర్‌తిరంగా.కామ్ వెబ్‌సైట్ గురించి వివరించాలని ప్రభుత్వం పేర్కొంది.

మూడు దశల్లో..

- తొలి దశ హర్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల గోడలు, బోర్డులపై తిరంగా స్ఫూర్తిని నింపే చిత్రాలతో అలంకరించాలి. కేంద్ర సాంస్కృతిక శాఖ పంపిన ఫొటోలతో ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేసి నాటి స్వాతంత్ర్య పోరాట దృశ్యాలను కళ్ల ముందుంచాలి. తిరంగా రంగోలి పోటీలు పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించాలి. తిరంగా రాఖీలను తయారు చేసి సైనికులు, పోలీసులకు పంపేలా పోస్టల్ శాఖతో సమన్వయం చేసుకోవాలి. బహిరంగ ప్రదేశాలు, మార్కెట్‌ల వద్ద తిరంగాని ప్రతిబింబిస్తూ కార్యకలాపాలు నిర్వహించాలి.
- రెండో దశ ప్రారంభమయ్యే ఈ నెల 9 నుంచి 12వ తేదీ మధ్యన భారీ స్థాయిలో తిరంగా మహోత్సవ్‌ని నిర్వహించాలి. ఈ కార్యక్రమానికి తప్పక స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, క్రీడాకారులు, పతాక గ్రహీతలు హాజరయ్యేలా చూడాలి. సెల్ఫీ బూత్‌లను ఎక్కడికక్కడ ఏర్పాటు చేయాలి. సాంస్కృతిక ప్రదర్శనలతో తిరంగా కార్యక్రమాలను నిర్వహించాలి. తిరంగా బైక్, సైకిల్ ర్యాలీలు నిర్వహించాలి. తిరంగా లైటింగ్‌లు మార్కెట్‌ల వద్ద ఏర్పాటు చేయాలి. ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా చూడాలి.
- మూడో దశ ఈ నెల 13 నుంచి 15వ తేదీల మధ్యన జెండా ఆవిష్కరణలు, ప్రభుత్వ, విద్యా సంస్థలు, హోటల్స్, డ్యాంలు, బ్రిడ్జీలకు తిరంగా లైటింగ్ ఏర్పాటు చేయాలి. రైల్వేస్టేషన్లు, స్కూల్స్, బహిరంగ ప్రదేశాలు వద్ద ఎగ్జిబిషన్‌లు నిర్వహించాలి. క్విజ్ పోటీలను పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించాలి. స్వచ్ఛత, సుజలత కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. రికార్డు స్థాయిలో మానవహారాలు కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు.

నిత్య ప్రయాణం.. తప్పని ప్రమాదం!

- ● అధ్వానంగా అంగలకుదురు - యడ్లపల్లి రోడ్డు
- ● ఆరేళ్లుగా అభివృద్ధికి నోచుకోని వైనం
- ● గుంతల మయంగా మారి, కుంగిపోయి..
- ● నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



రోడ్డుపై ఏర్పడిన గుంతలు



అధ్వానంగా ఉన్న అంగలకుదురు - యడ్లపల్లి రోడ్డుపై వెళుతున్న వాహనాలు



కోసుకుపోయి ప్రమాదకంగా ఉన్న రోడ్డు

తెనాలి రూరల్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఆ రోడ్డుపై ప్రయాణమంటే వాహనదారుల్లో వణుకుపుడుతోంది. గత టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన తారు రోడ్డు కొన్ని రూపురేఖలు మారి అధ్వానంగా తయారై.. డేంజర్ బెల్ మోగిస్తోంది. తెనాలి మండలం అంగలకుదురు నుంచి చుండూరు మండలం యడ్లపల్లి వెళ్లే రోడ్డ దుస్థితి ఇది. ఐదేళ్ల వైసీపీ పాలనలో సంక్షేమం, అభివృద్ధి అని ప్రచారం మినహా మూడు కిలోమీటర్ల రోడ్డుకు తట్టెడు మట్టి వేసి.. గుంతలు కూడా పూడ్చలేకపోయారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ రోడ్డుకు మోక్షం లభించకపోదా అని వాహనదారులు ఎదురు చూస్తున్నారు. నిత్యం వేలాది మంది గ్రామీణ ప్రాంత ప్రయాణికులు.. ఏదో ఒక అవసరంపై ఆ మార్గంలో అంగలుకుదురు కూడలికి చేరి అక్కడి నుంచి గుంటూరు, తెనాలి ప్రధాన రహదారిగా ప్రయాణం చేస్తుంటారు.

అందరికీ ఇదే మార్గం..

చిన్నపాటి అనారోగ సమస్యలు తలెత్తినా తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు సైతం ఇదే రోడ్డులో రాకపోకలు సాగించాల్సి ఉంది. యడ్లపాడు నుంచచి తెనాలికి కేవలం 6 కిలోమీటర్లు మాత్రమే ఉండటంతో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులు, వివిధ ఉద్యోగులు, వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, పురుగు మందులు వంటివి కొనుగోలు చేసేందుకు కూడా ఇదే మార్గంగా రాకపోకలు చేయాల్సి ఉంది. పంట ఉత్పత్తులను వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలించేందుకు ఇదే మార్గం.

ప్రమాదాలకు నెలవు..

ఈ రోడ్డులో కొంత దూరం చిప్స్ తేలిపోయి.. వాహనం టైర్లు జారిపోయే పరిస్థితి ఉంది. ఈ రోడ్డుకు ఇరు వైపులా.. పంట కాల్వలు ఉన్నాయి. ముందు వాహనం వెళితే వెనక వాహనదారులు ప్రయాణం చేయలేని పరిస్థితి. ప్రధానంగా దుమ్ము లేచి గాలిలో కలిసిపోయి.. వాహనదారులు ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి నెలకొంది. రోడ్డు అధ్వానంగా ఉండడంతో.. ఆటోలు త్వరగా మరమ్మతులకు గురవుతున్నాయని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రులు ఇదే రోడ్డు మార్గంలో ప్రయాణించే పలు వాహనదారులు గుంతలను తప్పించబోయి.. అదుపుతప్పి ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులుగా మారారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచి రోడ్డు ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారుతుంది. గర్భిణులు, వృద్ధులు వంటి వారిని వైద్యశాలలకు తీసుకు వెళ్లే క్రమంలో 108 వంటి వాహనాలు కుదుపులకు గురై.. ఇబ్బందులు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వమైన ఈ రోడ్డు దుస్థితిపై దృష్టిపెట్టి సత్వరమే నూతన రోడ్డు పనులు ప్రారంభించి ప్రయాణం సురక్షితంగా జరిగేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జీవనాడికి జవసత్వాలు



కృష్ణమ్మకు పూజలు నిర్వహిస్తున్న రైతులు

- ● వరికపూడిశెల కల సాకారం చేసిన సీఎంకు రుణపడి ఉంటాం
- ● రైతు బాంధవులు బ్రహ్మానందరెడ్డి, లావుకు కృతజ్ఞతలు
- ● ప్రాజెక్ట్ వద్ద జలసాధన సమితి సభ్యుల క్షీరాభిషేకం

మాచర్లటౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రజల జీవనాడి, ఏడు దశాబ్దాల చిరకాల వాంఛ వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణ పనులకు అడుగులు పడుతున్న వేళ కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు రుణపడి ఉటామని వరికపూడిశెల జలసాధన సమితి సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం నల్లమల అటవీ ప్రాంతంలోని వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మించ తలపెట్టిన దమ్మర్లగొంది వద్ద కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, సారె సమర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వర్ధిల్లాలి అని, ప్రాజెక్ట్ కల సాకారం చేసినందుకు ధన్యవాదాలు చెబుతూ నినాదాలు చేశారు.

స్టంట్‌లు కాదు..ఏడాదిలోనే సాధించారు

గత పాలకులు ఇదిగో.. అదిగో వరికపూడిశెల అంటూ బూటకపు భూమి పూజలతో ఎన్నికల స్టంట్స్ చేశారని రైతులు ఈ ంసదర్భంగా విమర్శించారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి అడ్డంకిగా మారిన అటవీ శాఖ అనుమతులకు కావాల్సిన కనీస నిధులు కూడా విడుదల చేయకుండా చేతులెత్తేసి మోసం చేశారని గత వైసీపీ పాలన విధానాలను దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ప్రాజెక్ట్ ప్రాధాన్యతను పదే పదే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి.. నిధులు సాధించారని సంతోషం వ్యక్తం చేశారు.

రైతు బాంధవులు జూలకంటి, లావు

పల్నాడు ప్రాంత రైతు బాంధవులు ఎమ్మెల్యే జూలకంటి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అని రైతులు కొనియాడారు. ఈ ప్రాంత బిడ్డగా, రైతుగా స్థానిక ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రాజెక్ట్ నిర్మాణ ఆవశ్యకతను పదే పదే చట్ట సభల్లో ప్రస్తావించడం, ప్రాజెక్ట్ నిర్మించి తీరకుంటే రాజకీయాలు నుంచి తప్పుకుంటానని భీష్మించారని గుర్తుచేశారు. అలాగే ఈ ప్రాంత రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు గుర్తించి ఢిల్లీ నుంచి ప్రాజెక్ట్ అనుమతులు తీసుకురావడంలో ఎంపీ లావు చేసిన కృషిని రైతులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బొల్లాపల్లి, పుల్లల చెరువు, వెల్దుర్తి మండల రైతులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఒకరి మృతి

నకరికల్లు ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పొలం పనులకు వెళ్లిన రైతు ఉ పిడుగుపాటు గురై మృతి చెందాడు. ఈ విషాద ఘటన కుంకలగుంట గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. మండలంలోని కుంకలగుంట గ్రామానికి చెందిన ఊసా నాగేంద్రబాబు (34), చల్లా నాగేశ్వరరావుతో కలిసి విత్తనాలు చల్లేందుకు పొలానికి వెళ్లారు. వర్షం పెద్దది కావడంతో పాటు.. ఉరుములు మెరుపులు రావడంతో పొలం వద్దనే ఉండిపోయారు. ఈ క్రమంలో పిడుగు పడటంతో ఊసా నాగేంద్రబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పాప ఉంది. పొలం పనులకు వెళ్లి మృత్యువాత పడటం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది.

త్వరలో విస్తృత స్థాయిలో ఉద్యోగోన్నతులు



ఎంపీడీవోలకు సూచనలు చేస్తున్న డిప్యూటీ సీఎం వోఎస్డీ కె.వెంకటకృష్ణ

- ● డిప్యూటీ సీఎం ఓఎస్డీ కె.వెంకటకృష్ణ
- ● ఉద్యోగోన్నతులు పొందిన ఎంపీడీఓలకు శిక్షణ

బాపట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రం పరిధిలోని ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ప్రమోషన్ పొందిన ఎంపీడీఓలకు నెల రోజుల శిక్షణకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం వోఎస్డీ కె.వెంకటకృష్ణ పాల్గొన్నారు. శిక్షణకు సంబంధించిన విషయాలను క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమ్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత ప్రజాహితంగా మార్చేందుకు ఉప ముఖ్యంత్రి అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో 10వేల మందికి పైగా ఉద్యోగోన్నోతులు కల్పించామని, అతి త్వరలో మరి కొంతమందికి విస్తృత స్థాయిలో పదోన్నతులు కల్పించబోతున్నామని తెలిపారు. పంచాయతీరాజ్ సంస్థలను ఆర్థిక స్వాలంబన సాధించడానికి ఆదాయ వనరులను పెంపొందించుకొని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను, వివిధ శాఖలను సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా చేపట్టటానికి అధికారులు చొరవ చూపాలని నిర్దేశించారు. ఈ శిక్షణలను సద్వినియోగం చేసుకొని స్థానిక పరిపాలన తీరులో మార్పు చేకూరాలని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పెదకాపవరం గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాలకు సంబంధించిన డాక్యుమెంటరీ ప్రదర్శించారు. వివిధ శాఖల సమన్వయంతో గ్రామ ప్రజల భాగస్వామ్యంతో ఆపాఠశాలను కార్పోరేట్ పాఠశాల కన్న మిన్నగా తాను స్వయంగా ఏ విధంగా తీర్చిదిద్దిన వైనాన్ని సోదాహరణంగా వివరించారు. అదే స్ఫూర్తితో మండలాధికారులు మండలంలోని ఏదైన ఒక గ్రామం ఆదర్శగ్రామంగా తీర్చిదిద్ది తద్వారా మిగతా గ్రామాలలో అభివృద్ధి బాటలో పయనించేలా ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం విస్తరణ శిక్షణకేంద్రాన్ని పరిశీలించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో యూటీసీ ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు, వైస్ ప్రిన్సిపాల్ పి.పద్మజ, బోధనసిబ్బంది, 40మంది ఎంపీడీఓలు మొదటి బ్యాచ్‌కు హాజరయ్యారు.

ప్రకాశం బ్యారేజికి తగ్గిన వరద ఉధృతి

● దిగువకు 3,625 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల తగ్గడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 20 వేల 600 క్యూసెక్కుల వరదనీరు సోమవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు నీటి పారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 5 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 3,625క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టాకు 10,271, పశ్చిమ డెల్టా కాలువకు 8,004 క్యూసెక్కుల నీటిని వదలుతున్నట్లు జేఈ తెలిపారు.

విద్యుదుత్పత్తి ప్రారంభం

● 3 క్రస్ట్ గేట్లు ఎత్తి పులిచింతలకు నీరు విడుదల

రెంటచింతల,ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.9627 ఎంయూల విద్యుత్ తయారైనట్లు ఈఈ సుబ్రహ్మణ్యం చెప్పారు. 3 రేడియల్ క్రస్ట్ గేట్లను ఒకటిన్నర మీర ఎత్తి 21258, రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ ఛానల్ ద్వారా 8,640 మొత్తంగా 29,898 క్యూసెక్కులనీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 29,070 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు అంటే 247.70 అడుగులకు సమానమన్నారు.

సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున ప్రాజెక్ట్ నీటిమట్టం సోమవారం నాటికి 586.50 అడుగులు ఉంది. ఇది 302.91 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5,088, ఎడమ కాలువ ద్వారా 8280, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,664, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 44,132 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 66,407 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

చిన్ని గుండెకు పెద్దకష్టం

- ● ఆపరేషన్ ఖర్చులకు దాతల కోసం ఎదురు చూపు
- ● స్పందించిన రావిపాటి దేవేంద్రరావు 50వేల ఆర్థిక సహాయం అందజేత



వైద్యశాలలో చికిత్స పొందుతున్న చిన్నారి

ముప్పాళ్ళ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చిన్ని గుండెకు పెద్దకష్టం వచ్చింది. అభం శుభం తెలియని ఆ చిన్నారి పుట్టుకతోనే గుండెకు రెండు రంధ్రాలతో జన్మించాడు. వివరాలలోకి వెళితే పల్నాడుజిల్లా ముప్పాళ్ళ మండలం మాదల గ్రామానికి చెందిన షేక్ బాషాకు కుమార్తె ఉంది. ఆమెను డెలివరీ కోసం ఇంటికి తీసుకువచ్చాడు. గత నెల 31వ తేదీన కుమార్తెకు పురిటి నొప్పులు రావడంతో నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ బాషా కుమార్తె నసీమా మగబిడ్డకు జన్మనిచ్చింది. మగబిడ్డ పుట్టాడన్న ఆనందం భార్య భర్తలైన నసీమా, జానీబాషాలతో పాటు బంధువుల ముఖాలలో క్షణాలలో ఆవిరైపోయింది. గుండెకు రెండు రంధ్రాలతో పసిగుడ్డు జన్మించిందని డాక్టర్లు చెప్పడంతో వారు ఆ వార్తను జీర్ణించుకోలేక కన్నీటి పర్యంతమయ్యారు. బిడ్డకు వెంటనే ఆపరేషన్ చేయాలని, తక్షణమే గుంటూరు తీసుకు వెళ్ళాలని వైద్యులు చెప్పారు. వారు చిన్నారిని తీసుకుని గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు వెళ్ళారు. చిన్నారిని పరిశీలించి తక్షణమే ఆపరేషన్ చేయకపోతే బాబు ప్రాణానికి ప్రమాదమిని, ఆపరేషన్‌కు 2లక్షల రూపాయల వరకూ ఖర్చు అవుతుందని చెప్పారు. కాగా బాషాది, అతని కుమార్తె, అల్లుడిది నిరుపేద కుటుంబం. బాషా ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తుండగా, అల్లుడు జానీబాషా కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. దీంతో వీరి బంధువు నాగుర్ వలి చిన్నారి పరిస్థితిని వివరిస్తూ ఆపరేషన్‌కు ఆర్థి సహాయం అందించవలసిందిగా సోషల్ మీడియా వేదికగా అభ్యర్థించాడు.

స్పందించిన దాతలు

చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని దాతలు చెలించిపోయారు. తక్షణమే తమ వంతుగా ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ముప్పాళ్ళ మండలం నార్నెపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు రావిపాటి దేవేంద్రరావు తన వంతుగా చిన్నారి ఆపరేషన్‌కు 50వేల రూపాయలను అందజేశారు. సత్తెనపల్లి సాయికృష్ణ మల్టీస్పెషాలిటి ఆసుపత్రి ఎండీ డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, డాక్టర్ సింగరాజు విద్యులు 15 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపరేషన్‌కు ఇంకా డబ్బులు అవసరం అవుతాయని దాతలు స్పందించి 81067 01174 నెంబర్‌ను సంప్రదించాలని బాలుడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

రూ.కోట్ల సొమ్ముతో చిట్టీల వ్యాపారి అదృశ్యం

● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితులు

గుంటూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కోట్లాది రూపాయల చిట్టీల సొమ్ము తీసుకుని.. కుటుంబంతో చిట్టీల వ్యాపారి అదృశ్యమయ్యాడు. దీంతో బాధితులు సోమవారం జిల్లా ఎస్పీని ఆశ్రయించారు. బాధితుల వివరాల మేరకు.. నెహ్రూనగర్ 5వ లైనుకు చెందిన తిరుమలశెట్టి శాంతకుమారి, కుమారుడు సాంబశివరావు, కోడలు దీపిక, వీరి కుమారుడు ప్రభు సాయి తదితరులు సుమారు పదేళ్లుగా.. స్థానికంగా చిట్టీపాటలు నిర్వహిస్తున్నారన్నారు. సుమారు 40 నుంచి 50 మంది వద్ద చిట్టీలు వేశారన్నారు. చిట్టీ పాడుకున్న వారికి డబ్బు ఇవ్వకుండా.. వడ్డీ ఇస్తామని ఆశ చూపి ఆ మొత్తం వారి వద్దే ఉంచుకున్నారు. వాటితో పాటు అనేక మంది వద్ద నగదు రుణంగా తీసుకున్నారన్నారు. గత నెల 13న సాంబశివరావు, భార్య దీపిక, కుమారుడు ప్రభు సాయి ఇంటి నుంచి అదృశమయ్యారన్నారు. తల్లి శాంతకుమారి ఒకటే ఉందని, ఆమెను అడిగితే తిరుపతి వెళ్లారని అబద్ధాలు చెబుతోందని బాధితులు వాపోతున్నారు. అయితే వారు నగరంలోనే వేరే ప్రాంతంలో తలదాచుకుంటున్నారని చెబుతున్నారు. రూ.20 లక్షలు ఇవ్వాలని రంగిశెట్టి శ్రీనివాసరావు, రూ.18 లక్షలు ఇవ్వాలని పులి వెంకటేశ్వరరావు, రూ.10 లక్షల ఇవ్వాలని మేకల లక్ష్మీరెడ్డి, రూ.18 లక్షలు ఇవ్వాలని గోగినేని పద్మ, రూ.నాలుగున్నర లక్షలు ఇవ్వాలని విష్ణుకుమార్.. అదేవిధంగా తమ కూడా పెద్ద మొత్తంలో ఇవ్వాలంటూ పోలేపల్లి పార్వతి, వైసాయి శ్రీనివాస్, రామినేని వెంకటేష్, చెరుకూరి శ్రీనివాసరావు ఇరిగినేని మల్లికార్జునరావు... ఇలా బాధితులు ఎస్పీ కార్యాలయానికి బారులు తీరారు. సుమారు రూ. రెండున్నర కోట్ల వరకు బాధితులకు ఇవ్వాల్సి ఉంటుందని తెలుస్తోంది. ప్రభువు సాయికుమార్ తెనాలి సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ చదువుతున్నాడని.. ప్రతిరోజు కళాశాలకు వెళుతున్నాడని..బాధితులు అంటున్నారు.



ఎస్పీని ఆశ్రయించిన బాధితులు

ఇదేంది'రొయ్యా'.. ట్రంపు!

(5వ పేజీ తరువాయి)

భారం ఎగుమతిదారులపై పడనుంది. ఈ ప్రభావం అంతిమంగా రొయ్య రైతుల మీదే పడి మార్కెట్‌లో ధరలు మరింత క్షీణత నమోదయ్యే అవకాశాలున్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఏప్రిల్‌లోనే వేగంగా ధరల పతనం...

ఏప్రిల్‌లో ట్రంప్ తీసుకున్న సుంకాల నిర్ణయంతో గంటల్లోనే రొయ్యల ధరల్లో పతనం నమోదైంది. రూ.240 ఉన్న వంద కౌంట్ రొయ్య ధర ఏప్రిల్‌లో ట్రంప్ ప్రకటనతో ఒక్కసారిగా రూ.45 పతనమై రూ.195కు చేరింది. అన్ని రకాల రొయ్యల ధరల్లో కనిష్ఠంగా రూ.30, గరిష్ఠంగా రూ.50 తగ్గుదల అప్పట్లో నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పరిస్థితి తీవ్రతను కేంద్రం ద్వారా అమెరికా దృష్టికి తీసుకెళ్లి పన్నుల బాదుడును మూడు నెలల పాటు వాయిదా వేయించగలిగింది. దీంతో ఆక్వా రైతులతో పాటు ఎగుమతిదారులు కూడా కొంతమేర ఊపిరి పీల్చుకున్నారు. కానీ తాజాగా ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో సుంకాల వ్యవహారం మళ్లీ మొదటికొచ్చినట్లయింది. పది రోజుల కిందట వంద కౌంట్ రొయ్యల ధర రూ.260 ఉండగా, ప్రస్తుతం రూ.35 వరకు క్షీణత నమోదైంది. ఈ పతనం మరింతగా కొనసాగే అవకాశాలు కనబడుతుండడంతో ఆక్వా రైతులు రాబోయే నష్టాలను తలచుకుని విలవిల్లాడుతున్నారు.

స్థానిక వినియోగం పెంచడమే మార్గం

రొయ్యలకు స్థానిక వినియోగం పెంచడమే లక్ష్యంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర మాల్స్ రాజకీయ దోపిడీకి కేంద్రాలుగా మారాయి తప్పితే ఆక్వా రంగానికి ఒనగూరిన మేలు గుండుసున్నా. ఇక్కడ ఉత్పత్తి అయ్యే రొయ్యల్లో దాదాపు 80 శాతం ఎగుమతుల బాటే పడుతున్నాయి. ఇలాంటి పన్నుల సంక్షోభాలు ఎదురైనప్పుడు ఆక్వా రంగం బేల చూపులు చూడకుండా ఉండాలంటే ఉత్పత్తుల్లో కనీసం 50 శాతం స్థానిక వినియోగం ఉండేలా ప్రభుత్వాలు కృషి చేయాలి. నేరుగా రొయ్యలు, చేపలు వాడడమే కాకుండా వాల్యూ యాడెడ్ దిశగా ప్రాసెసింగ్ రంగాలకు రాయితీలు ఇచ్చి.. మార్కెట్‌లో ప్రవేశపెడితే కొంతమేర ప్రయోజనం ఉండే అవకాశం ఉంది. ఇదే కాకుండా మత్స్య ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే లాభాలపై కూడా పెద్ద ఎత్తున ప్రచారం కల్పించి ప్రజల్లో వినియోగాన్ని పెంచడంపైనే ఆక్వా రంగం మనుగడ ఆధారపడి ఉంటుంది.

రాజధాని రైతులకు 'రిటర్న్' గిఫ్ట్

(5వ పేజీ తరువాయి)

వారంతా బ్యాంకు రుణాల కోసం చేయని ప్రయత్నం లేదు. కానీ, బ్యాంకర్లు ససేమిరా అన్నారు. దీనికి తోడు భూములు ప్రభుత్వానికి ఇవ్వడంతో వాటిపై సహకార రుణాలు పొందే అవకాశం లేకుండాపోయింది. దీంతో రైతులు నరకం అనుభవించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వారి 'రుణ' కష్టాలు కొనసాగాయి. ఈ విషయం సీఎం దృష్టికి కూడా వెళ్లింది. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

● ముందుకొచ్చిన లీడ్ బ్యాంకు

రిటర్నబుల్ ప్లాట్లపై రుణాలివ్వాలని లీడ్ బ్యాంకు అయిన యూనియన్ బ్యాంకు తాజాగా జిల్లాలోని అన్ని బ్రాంచ్‌ల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రుణ మంజూరుకు ఈ ఏడాది ఫిబ్రవరిలోనే బ్యాంకులు ఆమోదం తెలిపాయి. ఫిబ్రవరిలో జరిగిన ఎస్‌ఎల్‌బీసీలో రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు అంగీకరించారు. కానీ, రుణాలివ్వడానికి ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో నెలన్నర క్రితం ఉండవల్లిలో సీఎం నిర్వహించిన సమావేశంలో రైతులు తమ గోడు వినిపించారు. తాజాగా జూలై 25న సబ్ కమిటీ సమావేశంలో ప్లాట్లపై రుణాలు ఇవ్వాలని తీర్మానించారు. ఈ తీర్మానం ఆధారంగా లీడ్ బ్యాంకు ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాల మేరకు బ్యాంకర్లు ముందుకు రావాలని రైతులు కోరుతున్నారు.

లక్ష్మీసుధ మరణం గ్రామానికి తీరని లోటు

● అద్దంకి నాంచారమ్మ కల్యాణ మండప ప్రతినిధి సురేంద్రబాబు



లక్ష్మీసుధ స్మారక సభలో ఆమె చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

పర్చూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నర్రా లక్ష్మీసుధ అకాల మరణం పర్చూరు గ్రామానికి తీరని లోటని అద్దంకి నాంచారమ్మ కల్యాణ మండప ప్రతినిధి కఠారి సురేంద్రబాబు అన్నారు. సోమవారం స్థానిక కల్యాణ మండప ప్రాంగణంలో అభయాంజనేయ స్వామి విగ్రహ కమిటీ, రోటరీ క్లబ్‌ఆఫ్ పర్చూరు సెంట్రల్, మహాప్రసాతన కమిటీ, గ్రామస్థుల సారధ్యంలో స్మారక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు మాట్లాడారు. ఆధ్యాత్మిక, గ్రామాభివృద్ధి కార్యక్రమాలతోపాటు, నిరుపేదల అభ్యున్నతికోసం రూ.కోటి రూపాలయ మేర విరాళం అందించడం ఆమె దాతృత్వానికి నిదర్శనం అన్నారు. అనంతరం అమె చిత్రపటానికి పూలమాలలతో నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో రొటేరియన్ పాబోలు ఉదయ భాస్కర్, మాజీ మున్సిపల్ సెక్రటరీ ఉప్పుటూరి మురళీకృష్ణ, డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు, కోటా హరిప్రసాద్, మంగళగిరి కోటేశ్వరరావు, ఒగ్గిశెట్టి నరసింహారావు, లంకా ప్రసాద్, కొమ్మాలపాటి శ్రీనివాసరావు, కాసా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో అర్జీలు వేగంగా పరిష్కరించాలి

తహసీల్దార్ నాగరాజు


కారంచేడు(పర్చూరు), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరిత గతిన పరిష్కరించే విధంగా సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ నాగరాజు స్థానిక రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కారంచేడు తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వీఆర్వోలు, సిబ్బందికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజీ, ఏవో నాగరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

కావూరివారిపాలెం(చీరాల), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వివాహిత ఆదివారం రాత్రి మృతిచెందారు.. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చీరాల మండల పరిధిలోని కావూరివారిపాలేనికి చెందిన ఆసోది ప్రమీల, సాయిబాబురెడ్డిలు దంపతులు. వీరికి 10 నెలల బాబు సంతానం. అయితే భర్త మద్యానికి బానిసగా మారి వేధిస్తున్న క్రమంలో మనస్థాపం చెంది గత నెల 30వ తేదీన పురుగుల మందు తాగింది. ఈక్రమంలో పొన్నూరులో చికిత్స పొందుతూ మృత్యువాత పడగా పోలీసులు కేసు నమోదు చేశారు.

శిథిలావస్థకు తరగతి గది

వెంటనే తొలగించాలని ఎంపీడీవోకు హెచ్‌ఎం వినతి



వినతి పత్రం అందజేస్తున్న హెచ్‌ఎం శివప్రసాద్

బల్లికురవ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెం గ్రామ ప్రాథమిక పాఠశాలకు చెందిన తరగతి గది శిథిలావస్థకు చేరిందని వెంటనే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా తొలగించాలని పాఠశాల హెచ్‌ఎం శివప్రసాద్ సోమవారం ఎంపీడీవో పాంగురంగస్వామికి వినతి పత్రం అందజేశారు. 30 ఏళ్ల క్రితం నిర్మించిన గదికావడంతో పైకప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయని ఈ సందర్భంగా అయన తెలిపారు. హెచ్‌ఎం ఇచ్చిన లేఖను ఉన్నతాధికారులకు పంపిస్తామని, శిథిలావస్థకు చేరిన గదిలోకి విద్యార్థులు ఎవరు వెళ్లకుండా చూడాలని ఎంపీడీవో హెచ్‌ఎంకు సూచించారు.

వెలిగొండ పనులు పూర్తి చేయాలి

● నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి ● రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు

మార్కాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రకాశం ప్రజలకు వరప్రదాయిని అయిన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని ఆలోచనాపరుల వేదిక ప్రతినిధి బృందం నాయకులు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో భాగమైన గొట్టిపడియ డ్యామ్, సొరంగ నిర్మాణ పనులను సోమవారం ఆలోచనాపరుల వేదిక ప్రతినిధి బృందం పరిశీలించింది. అనంతరం మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించి మూడు దశాబ్దాలు కావస్తున్నా ఇప్పటికీ పూర్తికాకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఈ ప్రాజెక్టు దేశంలో ఎక్కడాలేని విధంగా అతి తక్కువ నిధులతో కొన్ని లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందించే బృహత్తరమైన పథకం అన్నారు. మొదటి ఫేజ్ కింద రూ.2 వేల కోట్లు, రెండవ ఫేజ్ కింద రూ.2,500 కోట్లు కేటాయిస్తే ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందన్నారు. రూ.5 వేల కోట్లు కేటాయిస్తే పూర్తి అయ్యే ఈ ప్రాజెక్టు నిర్మాణంపట్ల ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. 2010లో గొట్టిపడియ, సుంకేసుల, కాకర్ల గ్యాపుల నిర్మాణం పూర్తయిందని, ప్రాజెక్టు పూర్తికాకపోవడంతో నిర్మాణానికి ఖర్చు చేసిన నిధులన్నీ వృథాగా పోయినట్టేనన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలన్నారు.

పశ్చిమ ప్రకాశంలో భూగర్భ జలాలు పూర్తిస్థాయిలో అడుగంటిపోయాయని, బోర్ల ద్వారా వచ్చిన నీటిని తాగడం ద్వారా ఫ్లోరైడ్ సమస్యతో ఈ ప్రాంత ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విశ్లేషకులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కృష్ణా, గోదావరి నుంచి కొన్ని లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలో వృథాగా పోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా సంఘం అధ్యక్షులు భవాని ప్రసాద్, ప్రతినిధులు ఎమ్.చక్రవర్తి, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ నాయకులు అందె నాసరయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే లక్ష్యం

● సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి

● సింగరాయకొండ గురుకుల పాఠశాలలో ఐఐటీ, నీట్ మెటీరియల్స్ పంపిణీ



విద్యార్థినులకు మెటీరియల్ అందజేస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే సీఎం నారా చంద్రబాబునాయుడు లక్ష్యమని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం రాత్రి స్థానిక గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు నారాయణ విద్యా సంస్థల సహకారంతో అందజేసిన ఐఐటీ, నీట్ మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2017 ఏడాదిలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు తొలిసారిగా గురుకులాల్లో మూడుచోట్ల ఐఐటీ, నీట్ సెంటర్లను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. మళ్లీ ఆయన సూచనలతో ఇప్పుడు వాటిని మూడు నుంచి పదికి పెంచమన్నారు. అందులో ఒకటి సింగరాయకొండ గురుకుల పాఠశాలలో ఐఐటీ, నీట్ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటుచేశామని తెలిపారు. ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లో విద్యార్థులకు తన కోరిక మేరకు నారాయణ విద్యాసంస్థల తరపున పురపాలకశాఖ మంత్రి నారాయణ ఉచితంగా మెటీరియల్స్ అందజేస్తున్నారని తెలిపారు.

ఐఐటీ, నీట్ బోధించే లెక్చరర్లకు ట్రైనింగ్ ఇవ్వడానికి కూడా అంగీకరించినట్లు వివరించారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి ముందుకొచ్చిన మంత్రి నారాయణకు ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఐఐటీ, నీట్‌లో తృటిలో అర్హత కోల్పోయిన విద్యార్థులకు లాంగ్‌టార్మ్ కోచింగ్ ఇవ్వడానికి త్వరలో విజయవాడలో కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి స్వామి తెలిపారు.

చెన్నమల్లేశ్వర స్వామి ట్రస్ట్‌బోర్డు కమిటీ ప్రమాణ స్వీకారం



చైర్మన్ సుబ్బాయమ్మను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

నాగులుప్పలపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అమ్మనబ్రోలు గ్రామంలోని శ్యామలాంబ సమేత శ్రీ చెన్నమల్లేశ్వర స్వామి దేవస్థానం నూతన ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం కోలహలంగా నిర్వహించారు. గ్రామ టీడీపీ కార్యాలయం వద్ద నుంచి నూతన ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులతో కలసి చెన్నమల్లేశ్వర స్వామి దేవస్థానానికి ర్యాలీగా చేరుకొన్నారు. అనంతరం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఈవో దామా నాగేశ్వరరావు ఆలయ చైర్మన్‌గా ఎంపికైన గుండు సుబ్బాయమ్మతో పాటు సభ్యులు చిడిపోతు సురేష్‌బాబు, ధూపాటి వీరనారాయణ, పాదర్తి సుబ్బయ్య, వావిలాల లలితాదేవి, అజ్జం సరోజిని, మేకల శారద, మాచవరపు సురేష్, పచ్చిశెట్టి పవన్, ఎక్స్‌అఫిషియో సభ్యుడు కొల్లిపర నాగేశ్వరరావులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆలయంలో నూతన కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రమాణ స్వీకారం చేసిన ట్రస్ట్ బోర్డు సభ్యులను తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, దివంగత టీడీపీ నేత వీరయ్య చౌదరి తనయుడు ముప్పవరపు చంద్ర సిద్దార్థ, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు ఇంటూరి శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు గుడిపూడి రాజారావు, నాయకులు ఈదర వెంకటకృష్ణారావు, వలేటి పాండురంగారావు, మారెళ్ల జనార్దనరావు, మెట్టు సుబ్బయ్య నాయుడు, మహమ్మద్‌బేగ్ తదితరులు అభినందించారు.

దేవాంతకులు

» యథేచ్ఛగా ఆలయ భూముల ఆక్రమణ
» దర్జాగా పంటల సాగు
» ఏళ్లుగా అనుభవిస్తున్న కబ్జారాయుళ్లు
» అనేక గ్రామాల్లో దీనావస్థలో గుడులు



కంభంపాడులో ఆక్రమణకు గురైన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ భూమి

త్రిపురాంతకం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో దేవాలయాల ఆస్తులకు రక్షణ కరువైంది. వందల ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయి. వీటిలో పాగా వేసిన వారు ఏళ్ల తరబడి దర్జాగా పంటలు సాగు చేసుకుంటున్నారు. ఆలయాలకు పైసా కౌలు చెల్లించకుండా సొంత భూములుగా వాడుకుంటున్నారు. దీంతో రూ.కోట్ల ఆస్తులున్న ఆలయాలు కూడా ఆలనాపాలనా కరువై దీనావస్థకు చేరుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం మౌనం వహిస్తున్నారు. ఆక్రమణదారుల నుంచి అమ్యామ్యాలు పుచ్చుకుని మిన్నకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కబ్జాదారుల్లో కొందరు ఏకంగా ఆ భూములు తమవే అంటూ కోర్టులను ఆశ్రయిస్తుండగా వాటిపై మేమేమి చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ అధికారులు సమాధానం దాటవేస్తున్నారు.

ఆలయ భూముల్లో బత్తాయి మొక్కలు

ఎర్రగొండపాలెం మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలో ఉన్న లక్ష్మీచెన్నకేశవ దేవస్థానానికి పెద్దారవీడు మండలంలోని కంభంపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 35లో 4.31 ఎకరాల భూమి ఉంది. అందులో కొందరు పాగా వేశారు. బత్తాయి మొక్కలు నాటి కంది పైరును సాగు చేసుకుంటున్నారు. దీనిపై పలుమార్లు కొందరు ఫిర్యాదులు చేసినప్పటికీ ఈ భూముల వ్యవహారం కోర్టులో ఉన్నందున అక్కడే తేలాలని దేవదాయశాఖ అధికారులు చెప్తున్నారు. ఇది దేవదాయశాఖకు చెందిన భూమిగానే ప్రస్తుతం కూడా రెవెన్యూ అడంగల్‌లో ఉంది. అయితే కొందరు వ్యక్తులు ఈ భూమిని 1950లోనే తమకు అప్పట్లో పూజారి విక్రయించారని రికార్డులు చూపి కోర్టును ఆశ్రయించడంతో ఇప్పటికీ ఆ వివాదం నడుస్తూనే ఉంది. ఎర్రగొండపాలెం మండలంలోని

మిల్లంపల్లి వేణుగోపాలస్వామి దేవాలయానికి కూడా దాదాపు 90 ఎకరాల భూమి ఉంది. దీనికి నామమాత్రపు శిస్తు చెల్లిస్తూ కొందరు సాగు చేసుకుంటున్నారు. కొంత భూమికి పలువురు వేలం నిర్వహణకు కూడా ఆటంకాలు సృష్టిస్తూ ఎలాంటి కౌలు చెల్లించకుండా పంటలు సాగు చేసుకుంటున్నారు.

48 ఎకరాలు ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి!

దేవదాయశాఖ పరిధిలో లేకుండా ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో నడుస్తున్న ఆలయాలకు ఉన్న భూములు కూడా అధికంగానే అన్యాక్రాంతమయ్యాయి. పుల్లలచెరువు మండలంలోని శతకోడు సప్త కోటీశ్వరాలయంతోపాటు పలు ఆలయాలకు సంబంధించి దాదాపు 48 ఎకరాల భూమి ఎక్కడ ఎవరి పరిధిలో ఉందో కూడా తెలియని పరిస్థితి. ఎర్రగొండపాలెం మండలంలో దాదాపు మొత్తం 900 ఎకరాలకు పైగా ఆలయ భూములు ఉంటే వాటిపై వచ్చే శిస్తుతో దూపదీప నైవేద్యాలు దేవునికి అందాల్సింది పోయి చాలా ఆలయాలు దీనావస్థకు చేరుకున్నాయి. పుల్లలచెరువు మండలంలో కూడా ఆలయాలకు సంబంధించిన భూములు ఉన్నప్పటికీ వాటి గురించి కనీసం భక్తులకు కూడా అవగాహన లేకపోవడంతో కొందరు ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారంగా భూముల్లో పాగా వేసి పెత్తనం చెలాయిస్తున్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకున్నా ఆగని ఆక్రమణలు

గతంలో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించిన సమయంలో దేవదాయశాఖ పరిధిలోనివితోపాటు ప్రైవేటు ఆలయాల భూముల వివరాలు లెక్క తేల్చి వాటిని దేవాలయం పేరుతో ఆన్‌లైన్ చేయించింది. ఆ భూములను కాపాడేందుకు ప్రత్యేకంగా అధికారిని నియమించింది. దాదాపు రికార్డుల్లో చాలా వరకు ఆలయ భూములను నమోదు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ప్రైవేటు వ్యక్తులు అనుభవంలో ఉంటున్నారు. ఇప్పటికైనా ఆలయాల భూములను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకొని వాటిపై వచ్చే ఆదాయంతో దేవాలయాల్లో దూపదీప నైవేద్యం పెడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని భక్తులు కోరతున్నారు.

వానొస్తే.. వెత!



మండల కేంద్రమైన ఎర్రగొండపాలెంలో కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్లు జలమయమవుతున్నాయి. పలుచోట్ల కాలువలు లేకపోవడం, ఉన్న చోట్ల పూడిక పేరుకుపోవడంతో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతోంది. దీంతో వాహనదారులతోపాటు పాదచారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి ఒంగోలువారి వీధిలో కాలువల్లో నీరు ముందుకు ప్రవహించే వీలులేక రోడ్డుపై చేరింది. ఇందిరానగర్‌లో కాలువలు లేకపోవడంతో మోకాటి లోతున నిలిచిపోయింది. ఆ సమయంలో స్కూల్ వదలడంతో ఒంగోలువారి వీధి నుంచి ఇళ్లకు వెళ్లే విద్యార్థులు అవస్థపడ్డారు.

- ఆంధ్రజ్యోతి, ఎర్రగొండపాలెం

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

● బైక్‌ను ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

● మరొకరికి గాయాలు

పెద్దదోర్నాల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం మోటారు సైకిలును ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ దుర్ఘటన మండల పరిధిలోని గంటవానిపల్లె స్టేజి వద్ద కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎగువ చెర్లోపల్లి గ్రామానికి చెందిన పాముల విజయభాస్కర్(24) మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన కఠారి పోలురాజుకు గాయాలయ్యాయి. ఎస్సై మహేశ్ తెలిపిన కథనం ప్రకారం... విజయభాస్కర్, పోలురాజు దోర్నాలలో తమ పనులు ముగించుకుని మోటారుసైకిలుపై స్వగ్రామం చెర్లోపల్లి వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో బైక్ పైనుంచి ఇద్దరు కిందపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన ప్రయాణికులు పోలీసు స్టేషనుకు సమాచారం అందించారు. ఎస్సై మహేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని తన వాహనం ద్వారా క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యాధికారి చికిత్సలు నిర్వహించే క్రమంలో పరిశీలించగా అప్పటికే విజయభాస్కర్ మృతి చెందినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కాలేజీ వ్యాన్, మోటార్ సైకిల్ ఢీ

● ఇరువురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన రమేష్‌నాయుడు

మార్కాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న మోటార్ సైకిల్‌ను ఓ ప్రైవేటు కాలేజీకి చెందిన వ్యాన్ ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం ఉదయం స్థానిక మార్కెట్ యార్డ్ వద్ద చోటుచేసుకుంది. టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు... స్థానిక టాటా క్యాపిటల్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో లోన్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న తర్లుపాడు మండలం తాడివారిపల్లికి చెందిన ఎమ్.రమేష్‌నాయుడు, నెల్లూరు జిల్లా పొన్నలూరు మండలం పెద్దవెంకన్నపాలెంకు చెందిన టి.విజయ్‌కుమార్‌లు మోటార్ సైకిల్‌పై దోర్నాల వెళ్తున్నారు. మార్కెట్ యార్డు సమీపానికి చేరుకునే సరికి వెనుకనుంచి వస్తున్న ఓ ప్రైవేటు కాలేజీకి చెందిన వ్యాన్ ఢీకొట్టింది. దీంతో ఇరువురికి గాయాలయ్యాయి. వారిని స్థానికులు ఆటోలో ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో రమేష్‌నాయుడును ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీరాల పీఏసీఎస్‌కు ఉత్తమ అవార్డు

● మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా అందుకున్న మోహన్

చీరాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి ఉత్తమ సేవల అవార్డు లభించింది. 2023-24 సంవత్సరానికి సొసైటీ ఉత్తమ సేవలు అందించడంతో సంఘం చైర్మన్ కోటి మోహన్‌కు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

● ఒంగోలు నగరంలో విస్తృత ప్రచారం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఈనెల 20వతేదీ నుంచి జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం జిల్లాకేంద్రమైన ఒంగోలులో విస్తృత ప్రచారంతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కరపత్రాల ద్వారా ప్రచారం ప్రారంభించారు. ముందుగా మేయర్ గంగాడ సుజాతకు కరపత్రాన్ని అందజేసి మహాసభలకు ఆహ్వానించారు. ఈసందర్భంగా సీపీఐ నాయకుడు శ్రీరామ్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఒంగోలులో ఈనెల 20తేదీ నుంచి జరగనున్న సీపీఐ మహాసభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నగరంలోని ప్రజలందరూ పాల్గొని ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. స్థానిక సమస్యలపై పోరాడే పార్టీ సీపీఐ అన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు గుజ్జుల వలరాజు, మురళీ, ప్రభాకర్, సాయి, నాగభూషణం, పవన్‌కుమార్, బాలు, చంద్ర,తేజ, అరుణ, వెంకటరెడ్డి,ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.

అలరించిన చిన్నారుల శక్తి టీంలోగో

పందిళ్లపల్లి(చీరాల), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన శక్తి టీం లోగో అందరినీ అలరించింది. ఎస్సై జనార్ధన్ ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలపై లైంగిక వేధింపులు, ప్రమాకర సమయంలో యాప్ ప్రయోజనకరంగా ఉంటుందని ఎస్సై వివరించారు. కార్యక్రమంలో శక్తి టీం ఎస్సై హరిబాబు, సునీత, సుబ్బారావు, ధనలక్ష్మీ, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



శక్తి టీం లోగో ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అవీ..ఇవీ..

గడియార స్తంభం ఏర్పాటుకు శ్రీకారం

● స్థల పరిశీలన చేసిన మహేంద్రనాథ్, సాంబశివరావు



స్థలాన్ని పరిశీలిస్తున్న మహేంద్రనాథ్, సాంబశివరావు

చీరాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గత పాలకుల ఆకృత్యాలతో నియోజక వర్గ స్వరూపం అట్టడుగుకు చేరిందని, కూటమి ప్రభుత్వం అధికారంతో అభివృద్ధిబాటలు పడుతోందని నియోజకవర్గ టీడీపీ అధికారి ప్రతినిధి డా.మహేంద్రనాధ్ అన్నారు. మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావుతో కలిసి సోమవారం పట్టణంలో గడియారస్తంభం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. పేరుకే గడియార స్తంభం కానీ అక్కడ దాని ఆచూకీ లేకుండా పోవడం అన్యాయమన్నారు. వెంటనే ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. వ్యయ, ప్రయాసలకు ఓర్చి పట్టణంలో నూనత ఒరవడిని సృష్టించనున్నట్లు వివరించారు. మున్సిపల్ అధికారులకు వెంటనే రూపకల్పనకు సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీవో శ్రీనివాసులు, గడియార స్తంభం ఏర్పాటు అర్జీదారులు సర్విశెట్టి సుబ్బరామయ్య, పుల్లయ్యనాయుడు, ఆదినారాయణ, భూషణం, గద్దం శ్రీనివాసరావు, టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమర వీరుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్యం



దేశభక్తి గీతాల పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఎంతోమంది అమర వీరుల త్యాగఫలితం దేశ స్వాతంత్ర్యమని, అటువంటి మహనీయుల పోరాటాలను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వేటపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దీప్తి అన్నారు. సోమవారం పాఠశాలలో దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొనగా సీనియర్స్ విభాగంలో సమన్విత, షేక్ మెహతాజ్, సుహానా, జూనియర్స్ విభాగంలో రాము, శ్రీకా, ప్రణతి ఉత్తమంగా రాణించినట్లు వివరించారు. విజేతలకు ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా సంగీతం టీచర్ సునీత, పృథివి సునీత, యశోదర విద్యార్థులు పాల్గొన్నారు.

అలల తాకిడికి బీటెక్ విద్యార్థి మృతి

● పిడుగురాళ్ల నుంచి స్నేహితులతో వచ్చి మృత్యువాత

● ఒకరిని రక్షించిన గజ ఈతగాళ్లు




పాశం రవి (ఫైల్)

వాడరేవు(చీరాల), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : వాడరేవులో సరదాగా గడిపేందుకు వచ్చిన పిడుగురాళ్ల బిటెక్ విద్యార్థి మృత్యువాత పడ్డాడు. అందిన వివరాల ప్రకారం... గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన పాశం రవి(22) బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. అలాగే డిప్లమా చదువుతున్న సునీల్, ఎంఎల్‌టీ విద్యార్థి సాగర్, హైదరాబాదుకు చెందిన నవీన్‌లతో కలిసి రెండు ద్విచక్ర వాహనాలపై సోమవారం వాడరేవు సముద్రతీరానికి వచ్చాడు. ఈ క్రమంలో ఇద్దరు ఒడ్డునే ఉండగా రవి, సునీల్ సముద్రంలోకి దిగి కొంచెం లోతుకు వెళ్లారు. గమనించిన గజ ఈతగాళ్లు హుటాహుటీన వారి వద్దకు చేరుకుని రక్షణ రింగ్‌లు విసిరారు. అయితే సునీల్ అందుకుని ఒడ్డుకు చేరగా, రవి ప్రమాదవశాత్తు అలల తాకిడికి కొట్టుకు పోయాడు. దీంతో గాలింపు చర్యలు నిర్వహిస్తున్న కొద్దిసేపటికే అదే ప్రాంతంలో విగతజీవిగా ఒడ్డుకు చేరాడు. ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హాస్పిటల్ వద్దకు చేరుకుని బోరున విలపించారు.

కూటమి ప్రభుత్వంతో ప్రజలకు పాట్లు

● వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేష్



మాట్లాడుతున్న కరణం వెంకటేష్

చీరాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ పాలనతో నిరుపేద ప్రజలు పాట్లు పడుతున్నారని, సంక్షేమ పథకాల పంపిణీలో చిత్తశుద్ధి లేదని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 29వ వార్డులో 'బాబు షూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ తీరుపై పలు విమర్శలు గుప్పించారు. కార్యక్రమంలో పలువులు కౌన్సిలర్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు రద్దుతో విద్యార్థుల వెతలు

నిత్యం మూడు కిలోమీటర్లు నడిచి వెళుతున్న విద్యార్థులు



బస్సు లేక పాఠశాలల నుంచి నడిచి వెళుతున్న విద్యార్థులు

బల్లికురవ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఏబీసీ కాలువపై వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం కాలువ వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ నీటి ఉధృతితో కొట్టుకు పోయింది. దీంతో అద్దంకి నుంచి వల్లాపల్లి బల్లికురవ మీదుగా నర్సారావుపేట ఆర్టీసీ బస్సును అధికారులు రద్దు చేశారు. దీంతో నిత్యం బల్లికురవ వైపు నుంచి సంతమాగులూరు వైపు వెళ్లే పాఠశాల విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అద్దంకి నుంచి కొమ్మినేనివారి పాలెం నుండి బస్సు వచ్చే వీలు ఉన్న ఆర్టీసీ అధికారులు తమ ఇబ్బందులను పట్టించుకోకుండా వంతెన పనులు వంక చూపించి బస్సును రద్దు చేశారని విద్యార్థులు వాపోతున్నారు. ఈ రోడ్డులో నర్సారావుపేట వెళ్లేందుకు ఏకైక బస్సు ఉందని ఉన్న బస్సును కూడా రద్దు చేస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు తీరు ఇలానే ఉంటే తాము రోడ్లపై ధర్నాలు చేసేందుకు సిద్ధం అని పలువురు అంటున్నారు. ప్రతి రోజు విద్యార్థులు బల్లికురవ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల నుంచి ఏడు కిలోమీటర్ల మేర నడిచి ఇళ్లకు వెళుతున్నారు. అధికారులు వెంటనే నర్సారావుపేట బస్సును కొమ్మినేవారిపాలెం మీదుగా వచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తూర్పుతక్కెళ్ళపాడు మాజీసర్పంచ్ శ్రీనివాసరావు ఆత్మహత్య

నివాళి అర్పించిన మంత్రి రవికుమార్



నివాళి అర్పిస్తున్న మంత్రి రవికుమార్, ఇన్‌సెట్‌లో శ్రీనివాసరావు (ఫైల్)

పంగులూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు తక్కెళ్ళపాడు గ్రామ మాజీ సర్పంచ్ పచ్చ శ్రీనివాసరావు (61) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తన పొలంలో వేపచెట్టుకు ఉరివేసుకుని మరణించినట్లు రేణంగివరం ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు. మూడు దశాబ్దాలకు పైగా టీడీపీ నాయకునిగా కొనసాగుతున్న శ్రీనివాసరావు గ్రామ సర్పంచ్‌గా, తూర్పు కొప్పెరపాడు పీఏసీఎస్ ఉపాధ్యక్షునిగా పనిచేశారు. పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసే పచ్చ శ్రీనివాసరావు ఆత్మహత్యకు పాల్పడంపై పార్టీశ్రేణులు దిగ్భ్రాంతి చెందారు. శ్రీనివాసరావు మరణవార్త తెలుసుకున్న పలువురు పార్టీ నాయకులు మృతదేహంవద్దకు చేరుకుని నివాళులర్పించారు. శ్రీనివాసరావుకు భార్యతో పాటు వివాహితులైన కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు. ఘటనపై కేసు నమోదుచేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు.

పంగులూరు : మండలంలోని తూర్పుతక్కెళ్లపాడు టీడీపీ సీనియర్ నాయకులు పచ్చా శ్రీనివాసరావు అకాల మృతిపై రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి తక్కెళ్లపాడులోని శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి వెంట టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కేవీ.సుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, పూనాటి రామాంజనేయులు, డీసీ అధ్యక్షులు కుక్కపల్లి ఆంజనేయులు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, కోమటి ప్రసాద్, చింతల సహదేవుడు, గుర్రం ఆదిశేఖర్, పెదవల్లి అశోక్, మస్తాన్‌వలి, పిచ్చిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, గొట్టిపాటి కాజా, ధూళిపాళ్ల నారాయణస్వామి,తో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొని మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు.


శరవేగంగా కొమ్మమూరు కాలువ ఆధునికీకరణ పనులు



కారంచేడు - కుంకలమర్రు మధ్య వంతెన మరమ్మతులు

కారంచేడు(పర్చూరు), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని కొమ్మమూరు కాలువ అధునీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక కృషితో దశాబ్ధాలుగా మరమ్మత్తులకు నోచుకోని కొమ్మమూరు కాలువ పనుకు గ్రహణం వీడినట్లయ్యింది. కారంచేడు - కుంకలమర్రు గ్రామాల మధ్య కొమ్మమూరు కాలువ 78.685 కిలో మీటర్ల వద్ద సర్‌ప్లస్ ఎస్కేప్ షట్టర్లు, ఐరన్ ఛానెళ్ల పునరుద్ధరణ కోసం ఏలూరి కృషి ఫలితంగా రూ.21.98 లక్షల నిధు లను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం విడుదలైన నిధులతో కాలువ కట్టలు బలోపేతం చేయడం తోపాటు, గుర్రపు డెక్కను తొలగించే విధంగా పనులు చేపడుతున్నారు. ఈ ఆదునీకరణ వల్ల భారీ వర్షాలు, వరదలు ఇతర విపత్తుల సమయం లో కాలువ ప్రవాహాన్ని నియంత్రించే విధంగా దోహద పడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏకాంతస్పర్శ కవితా సంపుటి ఆవిష్కరణ



కవిత సంపుటిని ఆవిష్కరిస్తున్న రఘురామకృష్ణంరాజు

అద్దంకి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): అద్దంకికి చెందిన చందలూరి నారాయణరావు రచించిన ఏకాంత స్పర్శ కవితా సంపుటి ని అవనిగడ్డలో జరిగిన మాజీమంత్రి మండి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాలలో ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు ఆవిష్కరించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ మంత్రులు వసంత నాగేశ్వరరావు, నన్నపనేని రాజకుమారి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ తదితరుల సమక్షంలో ఈ సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చందలూరి నారాయణరావును పలువురు అభినందించారు.

వృద్ధులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

అద్దంకి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): శింగరకొండలోని శ్రీరామ వృద్ధుల ఆశ్రమంలోని వాసవి ధన్వంతరీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులు, భక్తులకు అన్నదానం చేశారు. నాగులపాడుకు చెందిన కరి శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె చండీ ప్రియ పుట్టిన రోజు, ముండ్లమూరు మండలం శంకరాపురానికి చెందిన పేరం శ్రావణ్ కుమార్, సుస్మితల కుమార్తె మేఘన తలనీలాలు సమర్పణ సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమం నిర్వహకులు రావూరి రంగయ్య, పూర్ణయ్య, ట్రస్ట్ అధ్యక్షుడు తమ్మన శ్రీనివాసరావు, రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, నర్రా గోపాలరావు, అంజాద్‌బాషా, కరి శ్రీలక్ష్మి, అయితా రాజా తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వృద్ధుడు మృతి

మార్టూరు, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కాలువలో పడి వృద్ధుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని ద్రోణాదుల గ్రామంలోని బొబ్బేపల్లి రోడ్డులో సోమవారం చోటుచేసుకొంది. ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంకొల్లు మండలం నాగండ్ల గ్రామానికి చెందిన మురికిపూడి విజయశేఖరరావు(64) అదే గ్రామానికి చెందిన వీరాంజనేయులు అనే వ్యక్తితో కలిసి ద్విచక్రవాహనంపై ద్రోణాదుల వచ్చాడు. అక్కడ గ్రామంలోని మద్యం దుకాణంలో మద్యం సేవించారు. అనంతరం వీరాంజనేయులు నాగండ్ల గ్రామానికి వెళ్లాడు. విజయశేఖరరావు మద్యం మత్తులో బహిర్భూమికి వెళ్లి కాలువలో పడి మృతిచెంది ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుమారుడు షడ్రక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

● రూ.2.08,960 నగదు స్వాధీనం

● 12 మంది జూదరుల అరెస్టు

చీరాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల - కారంచేడు రోడ్డులోని పులగ కాలువ సమీపంలోని పేకాట స్థావరంపై చీరాల వన్‌టౌన్ సీఐ సుబ్బారావు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈక్రమంలో 12 మంది జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.2,08,960 నగదును స్వాధీనం చేసుకున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఈపూరుపాలెం(చీరాల), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఈపూరుపాలెం - స్టూవర్టుపురం స్టేషన్‌ల మధ్య సోమవారం ఉదయం చోటుచేసుకొంది. గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటే క్రమంలో రైలు ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం సమయంలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు

పర్చూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని ఎస్సై జీవీ.చౌదరి అన్నారు. అలాంటి వారు ద్విచక్రవాహనాలతోపాటు, ఇతర వాహనాలు నడిపినట్లు గుర్తిస్తే సంబంధిత వాహన యజమానిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. సోమవారం పర్చూరులో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. పలువురు మైనర్లు వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి వారిని నిలుపుదల చేసి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ చేపట్టారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి దేవాలయ పాలకవర్గం ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి

అద్దంకి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరశింహస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. దేవాదాయశాఖ అద్దంకి డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు సభ్యులతో ప్రమాణం చేయించారు. చైర్మన్‌గా గుంజి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా మంగమూరి సురేష్, దాసరి రామాంజనేయులు, రుద్రు ఆదిలక్ష్మి, కొడిమెల కోటేశ్వరమ్మ, చీమలదిన్నె వెంకటరమణ, కస్తూరి లక్ష్మీప్రసూన, బత్తుల సరిత, అద్దంకి ఆదిలక్ష్మిలతో పాటు ఎక్స్‌అఫిసియో సభ్యులుగా పూజారి భాగవతుల నరశింహాచార్యులు ప్రమాణం చేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారుల నిర్ధారణ పరీక్షలు

● 67 మంది హాజరు.. 51 మంది ఎంపిక



పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

పేరాల(చీరాల), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాలున్న 18 ఏళ్లలోపు చిన్నారులకు ఉపకరణాలు అందించేందుకు నిర్వహించిన మెడికల్ ఎసెస్మెంట్(వైద్య నిర్ధారణ) విజయవంతంగా ముగిసింది. పేరాల ఏఆర్‌ఎం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చీరాల, వేటపాలెం, చినగంజాం నుండి 67 మంది దివ్యాంగ చిన్నారులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈక్రమంలో ఇందులో 51 మందిని అధికారులు ఎంపిక చేశారు. వారికి త్వరలో ఉపకరణాలు అందించనున్నట్లు తెలిపారు. క్యాంపులో అలింకో వైద్యబృందం హాజరై పరీక్షలు నిర్వహించగా, జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్యా సమన్వయ కర్త జ్యోత్స్న, ఎంఈవోలు రమాదేవి, సుధారాణి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణమోహన్, ప్రతినిధులు దరబడి రాజశేఖర్‌బాబు, నరసింహా, బాలకృష్ణ, విజయ్‌కుమార్, యోహాను, రవిశేఖర్, జాన్సన్ చిన్నారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నడక మార్గం ఏర్పాటు



పాఠశాలలో నీరునిలిచే నడక మార్గంలో ఏర్పాటుచేసిన గ్రావెల్ రోడ్డు

పంగులూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూజెళ్లపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో నీరునిలిచే నడక మార్గంలో దాతసాయంతో గ్రావెల్ రోడ్డు నిర్మించారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో కొద్దిపాటి వర్షానికే నడక దారిలో నీరు చేరుతోంది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్థుల ద్వారా సమస్యను గుర్తించిన మద్దినేని కృష్ణచైతన్య రూ.12వేల సొంతనిధులు వెచ్చించి వర్షపునీరు వెలుపలకు వెళ్లేలా తూములు అమర్చి గ్రావెల్ పరిపించారు. సమస్య పరిష్కారానికి సహకరించిన దాత మద్దినేని కృష్ణచైతన్యకు పాఠశాల హెచ్‌ఎం జె.వెంకటేశ్వర్లు, కేమా వీరాంజనేయులు, లావణ్య సహఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



కరపత్రాల పంపిణీ చేస్తున్న నాయకులు

చీరాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్‌మీటర్లపై రాష్ట్ర ప్రభుత్వం భిన్న స్వరాలు వినిపించడం అన్యాయమని వెంటనే వాటిని రద్దు చేయడంతో పాటు విద్యుత్ ధరలు తగ్గించాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అందుకు సంబంధించి మంగళవారం అన్ని విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలో కర పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల శామ్యేల్, చిరుమల ప్రకాష్, బాసి పైడయ్య, ఊటుకూరి వెంకటేశ్వర్లు, మాచర్ల మోహనరావు, ఎన్ బాబురావు, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

బల్లికురవ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్లపాటు చెన్నుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రవి సాగర్, విజయక్ష్మి, మమతలను సోమవారం పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు పాఠశాల బలోపేతానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు దూళిపాళ్ల శేషగిరి, ఉపాధ్యాయులు సంధ్యారాణి, రమణమూర్తి, సురేఖ స్వరూప, సుబ్బారావు, సుభాని, రాణి, నిలోఫర్, భవన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు వ్యాధినిరోధక శక్తి



తల్లిపాల విశిష్ఠతను వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ

పంగులూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు గంటలోపు తాగించే ముర్రుపాలతో వ్యాధినిరోధకశక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ అన్నారు. మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామంలో సోమవారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణులకు శ్రీమంతం, బాలింతల బిడ్డలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని, బిడ్డకు శక్తినివ్వడంతో పాటు తల్లికి బిడ్డకి అనుబంధం ఏర్పడుతుందని సూపర్‌వైజర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రామాంజమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగశిరోమణి, రజని, ఆశావర్కర్లు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధంతో ఇబ్బంది పెడుతున్నారు

● వీఆర్‌వో భార్య ముంతాజ్ ఆరోపణ

మేదరమెట్ల: తన భర్త వివాహేతర సంబంధం పెట్టుకొని తనను పిల్లలను ఇబ్బంది పెడుతున్నాడని వీఆర్‌వో బాష భార్య ముంతాజ్ ఆరోపించారు. ఆదివారం రాత్రి తిమ్మనపాలెం చెక్‌పోస్టు వద్ద మరో మహిళ వద్ద భర్త బాషా ఉండగా బంధువులతో కలిసి వెళ్లి పట్టుకున్నట్లు ఆమె తెలిపారు. గత ఐదేళ్లగా తనను ఇబ్బంది పెడుతున్నాడని పిల్లలకు ఫీజులు, ఇంటిలో తన కనీస అవసరాలకు కూడా డబ్బులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇచ్చిన కట్నం కాకుండా అదనంగా కట్నం తీసుకురమ్మని హింసిస్తున్నట్లు ఆమె తెలిపారు. రాత్రివేళలో ఇంటి వద్ద ఉండకుండా మరో మహిళతో అక్రమ సంబందం పెట్టుకొన్నాడన్నారు. 2023లో తనను కొట్టి పిల్లలతో సహా పుట్టింటికి తరిమేసినట్లు తెలిపారు. అనంతరం వినుకొండ పోలీసు స్టేషన్‌లో రాజీ కుదుర్చుకొని మరలా తనను తీసుకొచ్చి కొద్దినెలలు బాగానే ఉన్నాడన్నారు. తర్వాత దుర్వ్యసనాలకు లోనై తనను వేధిస్తున్నాడని ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నట్లు తెలిపారు.